J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16





THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 48 03.05.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# విద్వేషాలతో విధ్వంసం



- ఓ వైపు సంఘటిత భారత్ అంటూనే... మరోవైపు కులమతాల రొచ్చు
- రిజర్వేషన్లు, మైనారిటీలు అంటూ... ప్రజల మధ్య రాజకీయ చిచ్చు

*ఓం సహనావవతు..! సహనౌభునక్తు..!*
*సహ వీర్యం కరవావహై..!*
*తేజస్వి నా వధీతమస్తు మా విద్విషా వహై..!*

*"భగవంతుడు మన ఇద్దరినీ రక్షించు గాక. మన ఇద్దరినీ పోషించు గాక, పరస్పరం శక్తివంతులమై శ్రమించెదము గాక, మన అధ్యయనం తేజోవంతం అగు గాక, పరస్పరం ద్వేషము లేకుండా ఉండెదము గాక." పాఠం చెప్పుకునే ముందు భారతీయ సంప్రదాయంలో గురుశిష్యులిద్దరూ చెప్పుకునే శాంతి మంత్రమిది.*

- భారత్ భవిష్యత్తును నిర్ణయించేది కులమతాలా?

*"దేశమనియెడి దొడ్డ వృక్షం... ప్రేమలను పూలెత్తవలెనోయ్" అన్నది దేశభక్తి గేయంలో గురజాడ మాట.*

*"విద్వేషం పాలించే దేశం... విధ్వంసం నిర్మించే స్వర్గం" రెండూ ఉండవన్నది ఓ సినిమాలో సిరివెన్నెల పాట.*

తరతరాలుగా భారతీయులు నమ్మి ఆచరణలో పెట్టిన "సంఘటిత" సిద్ధాంతానికి మన దేశంలోనే కానికాలం రావటం దురదృష్టకరమైన అంశం. స్థాయిని మరిచిన విమర్శలు, ప్రజలు ఏమను కుంటారోనన్న విచక్షణ కూడా లేని ప్రసంగాలు, గౌరవప్రదమైన వ్యక్తులు కూడా సంజాయిషీ ఇచ్చుకోవలసిన పరిస్థితులు... వీటన్నింటినీ చూస్తుంటే కొన్ని సమయాల్లో అసలు మనం భారతదేశంలోనే ఉన్నామా....? అనే సందేహం కూడా రాక మానదు. ఎన్నికలు వస్తే చాలు... నాయకులకు పూనకాలు వచ్చేస్తున్నాయి. చట్ట సభల్లో సమావేశాలు జరుగుతుంటే చాలు... ఒక్కొక్కరికీ ఒళ్ళు తెలియటం లేదు. ప్రతీ చోటా ఇవే పరిస్థితులు. ఇవేవో అభివృద్ధి కోసం అయితే ఫర్వాలేదు, తమ వ్యక్తిగత ప్రాభవం పెంచుకోవడానికీ, కులమతాల చిచ్చు రాజేయడానికీ జరుగుతుండడమే ఒకింత ఆందోళన కలిగిస్తోంది. ఈ పోకడలో మార్పు వస్తే తప్ప... ప్రజలకు రాజకీయాల పట్ల గౌరవం కలిగే పరిస్థితి వచ్చేలా లేదు.

14లో




## సంస్మరణ

నాయకులకే నాయకుడు
ఎందరికో మార్గదర్శకుడు
దీనజన బాంధవుడు
జన నేత... మన జనార్ధనుడు

అభివృద్ధి ప్రదాత.. మాజీ ముఖ్యమంత్రి
**డా॥ నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారు**
స్వర్గస్తులై తేది.09.05.2024 నాటికి
పదేళ్ళు గడవనున్న సందర్భంగా
వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

నేదురుమల్లి కుటుంబ సభ్యులు
బంధుమిత్రులు
మరియు అభిమానులు

## సోమిరెడ్డి సమక్షంలో..
# సీపీఐ నాయకుడు టీడీపీలోకి



దాదాపు పదిహేనేళ్ళుగా మనుబోలు మండలం మడమనూరు గ్రామంలో సీపీఐ నాయకునిగా ఉన్న కె.చైతన్య ఏప్రిల్ 27న టీడీపీలో చేరిపోయారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, ఆ పార్టీలో ఉంటే ప్రజలకు సేవచేసే అవకాశం ఉందని భావిస్తున్నానంటూ ఆయన మండలంలోని రాజవోలుపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మడమనూరు గ్రామ టీడీపీ నాయకుడు నూనె లక్ష్మయ్య ఆధ్వర్యంలో టీడీపీలోకి వచ్చిన చైతన్యకు సోమిరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎంతోకాలంగా సీపీఐ నాయకునిగా ఉన్న చైతన్య టీడీపీలోకి రావడం శుభ పరిణామమని ఈ సందర్భంగా సోమిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

# వైకాపాలో చేరినవారికి అండగా ఉంటా!



వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో వెంకటగిరి రూరల్ మండల వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అంకయ్యల ఆధ్వర్యంలో జంగాలపల్లి గ్రామ పంచాయతీ ముద్దంపల్లి గ్రామంలోని సుమారు 20 కుటుంబాలవారు తెలుగుదేశం పార్టీ నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వారందరికీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారితో మాట్లాడుతూ, వైకాపాలోకి వచ్చిన నాయకులకు, కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వైకాపాను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# 'కూటమి'ని గెలిపించాలి

## - బీజేపీ నాయకుడు మస్తానయ్యగౌడ్ పిలుపు



అవినీతి, అరాచకాలనే మేనిఫెస్టోగా రూపొందించుకున్న వైకాపాను ఓడించేందుకు ప్రజలు సమాయత్తం కావాలని బీజేపీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు మస్తానయ్యగౌడ్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 27న ఆయన నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో నరేంద్ర మోడీయే విజయం సాధించి మళ్ళీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూడా బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిదే గెలుపని, విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడని, మంచి వ్యూహకర్త పవన్ అని, అందరి కలయికతో ఈసారి వైకాపా ఓటమి తథ్యమని అన్నారు. ప్రజలంతా వైకాపాను గద్దె దించేందుకు ఏకం కావాలన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# బాబును మళ్ళీ రప్పిద్దాం



టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును మళ్ళీ సీఎంగా చేసుకుందామని, అవినీతి వైకాపాకు చరమగీతం పాడాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు చెప్పారు. ఏప్రిల్ 28న ఆయన కావలిలో తెలుగుయువత ఆధ్వర్యంలో జరిగిన 'బాబును మళ్ళీ రప్పిద్దాం' కార్యక్రమంలో పాల్గొని కావలిలో టీడీపీ బావుటాను ఎగరేయాలని, పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని అన్నారు. టీడీపీ గెలిస్తే ప్రజలకు కలిగే ప్రయోజనాలను, వారి కోసం అమలుచేయనున్న పథకాలను వివరించారు. కావలి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కావ్య కృష్ణారెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ మహిళా నాయకురాలు.. వైకాపాలోకి

సుమారు పదిహేనేళ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నా తగిన గుర్తింపు లేదని నిరాశను వ్యక్తం చేస్తూ, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అన్నెం లతారెడ్డి ఇటీవల కాంగ్రెస్‌పార్టీ నుంచి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైకాపాలో చేరిపోయారు.

# నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది

- 8 అసెంబ్లీ స్థానాలకు 115 మంది పోటీ
- లోక్‌సభ స్థానం కోసం 14 మంది రంగంలోకి

***ఏప్రిల్ 29వ తేదీ సోమవారంతో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఎన్నికల బరిలో నిలిచే వారెవరో స్పష్టత రావడంతో అధికారులు ఆ వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లాలోని 8 అసెంబ్లీ స్థానాలకు మొత్తం 115 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, నెల్లూరు లోక్‌సభ స్థానానికి 14 మంది ఎన్నికల బరిలో నిలిచారు. అసెంబ్లీల వారీగా చూస్తే..నెల్లూరు నగర నియోజకవర్గంలో 15 మంది, నెల్లూరు రూరల్‌లో 11 మంది, కావలిలో 13 మంది, సర్వేపల్లిలో 13 మంది, ఉదయగిరిలో 15 మంది, కోవూరులో 13 మంది, ఆత్మకూరులో 13 మంది, కందుకూరులో అన్నిస్థానాల్లోకంటే ఎక్కువగా 22 మంది ఎన్నికల బరిలో నిలిచారు. వివరాలిలా ఉన్నాయి.***

నెల్లూరు లోక్‌సభ స్థానానికి మొత్తం 21 మంది నామినేషన్లు వేయగా, వాటిలో 6 తిరస్కరణకు గురయ్యాయి. ఒక నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ స్థానంలో మొత్తం 14 మంది ఎన్నికల బరిలో నిలిచినట్లయింది. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి నెల్లూరు నగర నియోజకవర్గానికి 26 మంది నామినేషన్ వేయగా, 8 తిరస్కరణకు గురయ్యాయి. 3 నామినేషన్లు ఉపసంహరించబడ్డాయి. దీంతో ఈ నియోజకవర్గంలో మొత్తం 15 మంది ఎన్నికల బరిలో నిలిచారు. నెల్లూరురూరల్‌లో 13 నామినేషన్లు రాగా, ఒకటి తిరస్కరణకు గురైంది. మరొకటి ఉపసంహరణ జరిగింది. మొత్తం 11 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. కావలి నియోజకవర్గంలో 25 నామినేషన్లకుగాను, 10 నామినేషన్లను తిరస్కరించారు. 2 నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో అక్కడ 13 మంది నిలిచారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి 17 నామినేషన్లు రాగా, 4 తిరస్కరణకు గురయ్యాయి. 13 మంది రంగంలో ఉన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 22 మంది నామినేషన్లు వేశారు. అందులో 6 తిరస్కరణకు గురికాగా, 1 నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఉదయగిరిలో 15 మంది పోటీలో ఉన్నారు. కోవూరులో అత్యధికంగా 28 నామినేషన్లు రాగా, 9 తిరస్కరణకు గురికావడం, 6 ఉపసంహరించుకోవడంతో 13 మంది ఎన్నికల రంగంలో ఉన్నారు. ఆత్మకూరు స్థానానికి 15 నామినేషన్లు రాగా, 2 తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 13 మంది అక్కడ పోటీలో ఉన్నారు. కందుకూరు నియోజకవర్గం స్థానానికి 25 నామినేషన్లు రాగా, ఒక నామినేషన్ తిరస్కరణకు గురైంది. 2 నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. అక్కడ అత్యధికంగా మొత్తం 22 మంది ఎన్నికల రంగంలో ఉన్నారు.

## నెల్లూరుకు.. ఏడుగురు
# వైకాపా కో-ఆర్డినేటర్లు

నెల్లూరు నగర నియోజకవర్గంలో ఉన్న డివిజన్లలో ఎన్నికల పర్యవేక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఏడుగురు కోఆర్డినేటర్లను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం పనిచేస్తున్న పార్టీ నాయకులకు అదనంగా నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మనుక్రాంత్‌రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, మాళెం సుధీర్‌కుమార్ రెడ్డి, కిన్నెర ప్రసాద్, కొణిదెల సుధీర్‌లను కోఆర్డినేటర్లుగా నియమించారని పేర్కొన్నారు.

# పరిశీలకునిగా విష్ణు

అల్లూరు మాజీ ఎమ్మెల్యే, ఇటీవలే వైకాపాలో చేరిన కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డిని నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకునిగా నియమిస్తూ వైకాపా కేంద్ర కార్యాలయం ఏప్రిల్ 29న ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో విష్ణుకు ఆ బాధ్యతలను అప్పగించారు.

# పేదల మనసుల్లో ఉండేది..జగనే!

## నల్లపరెడ్డి ప్రసన్న



ఎవరెన్ని విమర్శలు చేసినా పేదల మనసుల్లో ఉండేది జగనేనని, రానున్న ఎన్నికల్లో వైకాపా అఖండ విజయం సాధించి ముఖ్యమంత్రి అయ్యేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని కోవూరు శాసనసభ వైకాపా అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలంలో ఉన్న కొండాయపాళెం, దామేగుంట, వెంకన్నపాళెం, రామన్నపాళెం, రెడ్డిపాళెం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి, వైకాపా పట్ల ప్రజలు ఎంతో అభిమానంతో ఉన్నారని, పేదప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన ఉన్నారని, విజయం వైకాపాదేనని ధీమా వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో తనను కోవూరు ఎమ్మెల్యేగా, విజయసాయిరెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీసీఎమ్మెస్ ఛైర్మెన్ వీరచలపతిరావు, మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పాలనలో రాష్ట్రం విధ్వంసం

## - జనసేన నాయకుడు సుజయ్‌బాబు విమర్శ -



ఈ అయిదేళ్ళలో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసం చేశారని జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు విమర్శించారు. సోమవారం నెల్లూరు నగరంలోని 16వ డివిజన్ గుర్రాలమడుగు సంఘంలో జనసేన నాయకులు, టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సిద్ధమైన 'సూపర్ సిక్స్' పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సుజయ్‌బాబు మాట్లాడుతూ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, చంద్రబాబునాయుడు నిలబెట్టిన అభ్యర్థులు ఈ ఎన్నికల్లో గెలవబోతున్నారని జోస్యం చెప్పారు. వైకాపా పాలనలో నెల్లూరు నగరం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని విమర్శించారు. ఒక్కసారి వైసీపీ ప్రభుత్వానికి ఓటువేసి మోసపోయామని, ఈసారి ఆ తప్పు జరగకుండా టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అభ్యర్థులను ప్రజలు గెలిపించుకోవాలని చెప్పారు. టీడీపీ పాలనలో ఉచితంగా ఇసుకను అందిస్తే, నేడు ఈ వైసీపీ ప్రభుత్వం రూ.5వేలకి ఇసుకను విక్రయిస్తోందని, అందువల్ల భవన కార్మికుల జీవితాలు అల్లకల్లోలమయ్యాయని, నిర్మాణరంగం పూర్తిగా దెబ్బతినిందని చెప్పారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో రాష్ట్రాభివృద్ధిని గాడిలో పెట్టేందుకు కూటమి అభ్యర్థులకు విజయం చేకూర్చాలన్నారు. నెల్లూరు నగరానికి సంబంధించి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న పొంగూరు నారాయణ, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.


బెజవాడ రామచంద్రారెడ్డి
1952 నుండి 1957 వరకు


రేబాల లక్ష్మీనరసారెడ్డి
1957 నుండి 1962 వరకు


బి.అంజనప్ప
1957 నుండి 1971 వరకు


డా॥ బెజవాడ గోపాలరెడ్డి
1962 నుండి 1967 వరకు


పులి వెంకటరెడ్డి
1971 నుండి 1977 వరకు


దొడ్డవరపు కామాక్షయ్య
1971 నుండి 1984 వరకు


పుచ్చలపల్లి పెంచలయ్య
1983 నుండి 1991 వరకు


కుడుముల పద్మశ్రీ
1991 నుండి 1996 వరకు


పనబాక లక్ష్మి
1996-99 & 2004-09


ఉక్కాల రాజేశ్వరమ్మ
1999 నుండి 2004 వరకు


మేకపాటి రాజమోహన్‌రెడ్డి
2009 నుండి 2019 వరకు


ఆదాల ప్రభాకరరెడ్డి
2019 నుండి 2024 వరకు

# నిన్నటివరకు వారు
## 1952 నుండి 2024 వరకు

# రేపటి నుండి ఎవరో
## 2024 నుండి 2029 వరకు

*రాజకీయంగా నెల్లూరుజిల్లాకి ఎంతో ఘనచరిత్ర ఉంది. అనేకమంది ఉద్దండులు గల్లీ నుండి ఢిల్లీ వరకూ రాజకీయంగా తమ ప్రాభవాన్ని చాటుకున్నారు. గడచిన తరంలో ఈ జిల్లావాసులు కీర్తిశేషులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, నేటి తరంలో నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రులుగా పనిచేస్తే ఇటీవలవరకు ముప్పవరపు వెంకయ్యనాయుడు భారత ఉపరాష్ట్రపతిగా సేవలందించి విశిష్టస్థాయిలో గుర్తింపుపొందారు. స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్య, కమ్యూనిస్టు యోధుడిగా, విప్లవ వీరుడిగా జాతీయ స్థాయిలో తమ ఉనికిని చాటారు. వీరితో పాటుగా బెజవాడ రామచంద్రారెడ్డి, వంగల్లు కోదండరామిరెడ్డి, ఏ.సీ.సుబ్బారెడ్డి, రేబాల దశరథరామిరెడ్డి వంటి అనేక మంది రాజకీయ దిగ్గజాలు చట్టసభలలో తమ సత్తా చాటారు.*

గడచిన 72సంవత్సరాలుగా అంటే 1952 నుండి 2004వరకు ఎంతోమంది పాత, కొత్త తరం నాయకులు చట్టసభలకు ఎంపికై తమ వాణిని వినిపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1952లో దేశంలో తొలిసారిగా సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పటి నుండి 2024 వరకు లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించిన వారి వివరాలను 'లాయర్' పాఠకుల కోసం అందిస్తున్నాం...

## 1952 నుండి 2024 వరకు లోక్‌సభకి వెళ్ళినవారు!

తొలిసారిగా 1952లో లోక్‌సభకి జరిగిన ఎన్నికలో బెజవాడ రామచంద్రారెడ్డి ఇండిపెండెంటు అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తరువాత 1957 నుండి నెల్లూరు పార్లమెంటుని ద్విసభ్య నియోజక వర్గంగా మార్చి ఇద్దరు సభ్యులను ఎన్నుకునే సంప్రదాయాన్ని ప్రారంభించారు. వారిలో ఒకరు ఖచ్చితంగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారై ఉండాలన్న నిబంధన ఉండేది. అప్పట్లో రేబాల లక్ష్మీనరసింహారెడ్డి రెడ్డి సామాజిక అభ్యర్థిగా విజయం సాధించగా, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బి.అంజనప్ప రెండవ అభ్యర్థిగా గెలుపొందారు. అక్కడినుండి వరుసగా 1962లో బెజవాడ గోపాలరెడ్డి, బి.అంజనప్ప, మళ్ళీ 1967లో రేబాల దశరథరామిరెడ్డి, బి.అంజనప్పలు ఎన్నుకోబడ్డారు. నీలం సంజీవరెడ్డి ఆశీస్సులతో అనంతపురం నుండి నెల్లూరుకు వలసవచ్చిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అంజనప్ప మూడు పర్యాయాలు వరుసగా గెలిచి లోక్‌సభ సభ్యుడిగా ఉన్నారు. అంటే 1971 వరకూ ఆయన నెల్లూరుజిల్లా నుండే లోక్‌సభకి ప్రాతినిధ్యం వహించారు. 1971-77 సంవత్సరాల మధ్య కాలంలో పులి వెంకటరెడ్డి, దొడ్డవరపు కామాక్షయ్యలు ఎంపీలుగా ఉన్నారు. 1977 నుండి నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం పూర్తిగా ఎస్సీ నియోజకవర్గంగా ప్రకటించబడింది. అప్పటినుండి 2004 ఎన్నికల వరకు అలాగే పరిగణించబడింది. ఆ తరువాత జరిగిన నియోజకవర్గ పునర్విభజనలో 2009 నుండి జనరల్ అయ్యింది.

దొడ్డవరపు కామాక్షయ్యే 1971 నుండి 1984 దాకా 13సంవత్సరాలు పార్లమెంటు సభ్యుడిగా కొనసాగారు. ఆ తరువాత 1983 ఉప ఎన్నికలోనూ, 1984, మళ్ళీ 1989లో జరిగిన సార్వత్రిక ఎన్నికల లోనూ పుచ్చలపల్లి పెంచలయ్య వరుసగా మూడుసార్లు విజయం సాధించారు. 1991లో జరిగిన ఎన్నికలలో కుడుముల పద్మశ్రీ, 1996, 1998లో పనబాక లక్ష్మి, 1999లో ఉక్కాల రాజేశ్వరమ్మ, 2004లో మళ్ళీ పనబాక లక్ష్మిలు విజయం సాధించారు. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం జనరల్‌గా మారడంతో అప్పటివరకూ ఒంగోలుకు దత్తు వెళ్తుండిన నెల్లూరు బడా నాయకులు సొంత జిల్లా నుండి పోటీ చేయడం మొదలుపెట్టారు. 2009 సాధారణ ఎన్నికలలో, 2012 ఉపఎన్నికలో, మళ్ళీ 2014 సాధారణ ఎన్నికలో కూడా మేకపాటి రాజమోహన్‌రెడ్డి విజయం సాధించారు. 2019లో జరిగిన ఎలక్షన్లో నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా ఆదాల ప్రభాకరరెడ్డి పోటీచేసి ఘన విజయం సాధించారు. మళ్ళీ అయిదేళ్ల తరువాత 2024లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. మే 13వ తేదీ పోలింగు జరగబోతోంది.

## 'తగ్గేదే లే' అన్నట్లుగా తలపడుతున్న నేతలు!


వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి
తెలుగుదేశం పార్టీ


వేణుంబాక విజయసాయిరెడ్డి
వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ


కొప్పుల రాజు
కాంగ్రెస్

### వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా "సేవాభూషణ్", మాజీ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాలలోకి అడుగుపెట్టారు. ఆయనకి రాజకీయాలు కొత్తే కానీ, సేవ కొత్తకాదు. దానకర్ణులకి పుట్టినిల్లయిన నెల్లూరులో పాతతరం దాతల ఆనవాయితీని కనుమరుగు కానీయకుండా గత పాతికేళ్ళుగా తన సేవా కార్యక్రమాలతో నెల్లూరీయుల మనస్సుల్లో కొలువైన సేవాస్ఫూర్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. వీపీఆర్‌గా ఆయన ప్రసిద్ధి. తన పేరుతో విపిఆర్ ఫౌండేషన్ స్థాపించి, ఆకలితో ఉన్న అనాథలకు అన్నం పెడుతున్నారు. ఆసరా లేని అవ్వాతాతలకి ఆధారమయ్యారు. అనారోగ్యంతో బాధపడే పేద బడుగు బలహీన వర్గాలవారికి "వీపీఆర్ వైద్యం" అంటూ అండగా నిలిచారు. చదువు కొనలేని మేధావులైన నిరుపేద చిన్నారుల కోసం నేనున్నానంటూ "వీపీఆర్ విద్య" పేరుతో ఒక్క పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయిలో విజ్ఞాన దీపాన్ని వెలిగిస్తున్నారు. దాహంతో అలమటిస్తున్న మారుమూల గ్రామాల ప్రజల దాహాన్ని తీర్చడానికి "వీపీఆర్ అమృతధార" ఉదన్న సందేశమిస్తూ వాటర్ ప్లాంటులు పెట్టి కొన్ని లక్షల మంది ప్రజల దాహాన్ని తీరుస్తున్నారు. ఓవైపు "మానవ సేవే మాధవ సేవ" అంటూనే.. మరోవైపు నిరంతరం దైవ కార్యక్రమాలతో నెల్లూరు నేలపై ఆధ్యాత్మిక వెలుగులు ప్రకాశింపచేస్తూనే ఉన్నారు. వెనుకబడిన తరగతులవారికి ప్రభుత్వ ఆధ్వర్యంలో హాస్టళ్ల భవనాలని కట్టించారు. జైళ్లలో ఉన్న ఖైదీల కోసం సౌకర్యాలని కల్పించారు. పేదవారి కోసం పని చేసే ఆసుపత్రులకు అధునాతన యంత్రాలను సమకూర్చారు. వారి సిబ్బంది కోసం వాహనాలను అందించారు. రేపటి తరాలవారికి స్ఫూర్తిని రగిలించడం కోసం గడచిన తరాల వారి విగ్రహాలని తన సొంత ఖర్చుతో ఏర్పాటుచేశారు. కళలని పోషిస్తారు. మనుషులని ఆదరిస్తారు. మంచితనాన్ని ఆరాధిస్తారు. భాషని అభిమానిస్తారు. ఇలా... చెప్పుకుంటూపోతే జిల్లాలో ఏ రంగం పేరు చెప్పినా ముందుగా ప్రభాకరరెడ్డి గుర్తొచ్చేలా కార్యక్రమాలను నిర్వహించారు. రాజకీయాలని ప్రజాసేవ కోసం వేదిక చేసుకుని ప్రత్యక్ష ఎన్నికలలో మొట్టమొదటిసారిగా పోటీచేస్తున్నారు. ప్రజల దీవెనల కోసం జనం ముందుకొస్తున్నారు. దీవించి, గెలిపించి చట్టసభలకి పంపించమంటూ అభ్యర్థిస్తున్నారు.

### విజయసాయిరెడ్డి...

వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి పోటీగా అధికార పార్టీ వైసీపీ పక్షాన వేణుంబాక విజయసాయిరెడ్డి బరిలో దిగారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. గత 8ఏళ్లుగా ఆయన ఆ పదవిలో కొనసాగుతున్నారు. మరో నాలుగేళ్ళ పాటు ఆయనకి ఆ పదవి ఉంటుంది. కానీ పార్టీ అధినాయకుడి ఆదేశం మేరకు ఆయన ప్రత్యక్ష ఎన్నికల బరిలో దిగారు. ఆయన పేరుకి నెల్లూరీయుడైనా నెల్లూరుకి చుట్టమే. వృత్తిరీత్యా ఆడిటర్‌గా వుంటూ చెన్నైలో స్థిరపడ్డారు. అక్కడ నుండి 2004 తరువాత తన మకాం హైదరాబాదుకి మార్చారు. అనుకోని పరిస్థితులలో 2010లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. గతంలో నెల్లూరునుండి రాజ్యసభకు వెళ్లిన వాళ్ళు చాలామందే వున్నారు. ఒకానొక దశలో ఒకే సమయంలో 9 మందికి పైగా నెల్లూరీయులు ఎంపీలుగా ఉభయ సభలలో ప్రాతినిధ్యం వహించి తమ ప్రాబల్యం ప్రదర్శించారు. సాయిరెడ్డి కూడా నెల్లూరీయుడే.. కానీ, రాజ్యసభ సభ్యుడిగా సొంత జిల్లాకి పెద్దగా ఉపయోగపడలేదు. ఆయన స్వగ్రామం తాళ్లపూడిలో మాత్రం కొంత మార్పు తేవడానికి ప్రయత్నం చేశారు. ఇప్పుడు ఆయన నెల్లూరు అభివృద్ధి కోసం తనని గెలిపించమంటున్నారు. గెలిపిస్తే జిల్లా స్వరూపమే మార్చేస్తానంటున్నారు. జిల్లా నుండి ఎగిరి పోయిన ఎయిర్‌పోర్టుని తిరిగి రప్పిస్తానంటున్నారు. నగరానికి రింగురోడ్డు తెస్తానంటున్నారు. ఇదీ తన అజెండా అంటూ పార్టీతో సంబంధం లేకుండా సొంతంగా తానొక మ్యానిఫెస్టోని విడుదల చేశారు. తనని గెలిపిస్తే చాలా చేస్తానంటున్నారు. నిర్ణయం మీదే నంటూ ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నారు.

### కొప్పుల రాజు...

గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్‌పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు. కే.రాజుగా ఆయన నెల్లూరుజిల్లాకి చిరపరిచితులే. జిల్లా కలెక్టర్‌గా జిల్లా ప్రజలకి తెలిసిన వారే. కాంగ్రెస్‌పార్టీ తరపున ఆయన ఎన్నికల రణక్షేత్రంలో దిగారు. రెండు ఐరావతాల మధ్య కుందేలులా ఆయన కూడా వాడవాడలా తిరుగుతున్నారు. ముఖ్యంగా తన సామాజికవర్గాన్ని ఆకర్షించే ప్రయత్నంలో కుస్తీ పడుతున్నారు. కాంగ్రెస్ చేతికి అధికారమిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తామంటూ వాదాయిస్తున్నారు.

ఇదీ నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గంలో తాజా పరిస్థితి. ఇటు అధికారపార్టీ అటు ప్రతిపక్ష పార్టీ రెండూ ఈ ఎన్నికని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. తాడో పేడో అన్నట్లుగా తలపడుతున్నాయి.

నిన్నటివరకు ఉన్నవారి స్థానంలో... రేపెవరు రాబోతున్నారో తేలాలంటే మరో నెల రోజులు ఆగాల్సిందే.. మరి!...

లాయర్
మే 03, 2024

# వ్యవస్థను శంకించడం శ్రేయస్కరం కాదు

ఎన్నికల్లో తాము గెలిస్తే ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు)లు మంచివి..ఓడితే మాత్రం ఈవీఎంలు చెడ్డవి. తమ ఓటమికి అవే కారణమంటూ పాపం నోరులేని ఈవీఎంల మీద నిందలు వేయడం, ఆ వ్యవస్థనే శంకించడం మనదేశంలోని ప్రధాన రాజకీయపార్టీలకు అదో అలవాటైపోయింది. గతంలో ఓడిపోయినప్పుడు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈవీఎంలనే అనుమానించాయి. గెలిచినప్పుడు మాత్రం వాటి ప్రస్తావనే ఉండదు. 'ఆడలేక మద్దెల ఓడు' అన్న చందంగా, ఓడినప్పుడు మాత్రం ఈవీఎంలను తారుమారుచేసో, లేదా ఏ మాయో చేసి అవతలివారు గెలిచారంటూ ప్రచారాలు చేసుకోవడం, ఈవీఎంల మీద లేనిపోని రాద్ధాంతాలు చేయడం ఏమిటో అర్థం కాదు. అయినా ఈ ఈవీఎంలు ఇప్పటివి కాదు, 1998 ప్రాంతం నుంచీ ఉన్నాయి. చాలా దేశాల్లో ఎన్నికలప్పుడు ఈవీఎంలనే వినియోగిస్తున్నారు కూడా. అప్పటినుంచీ వీటిపై రాజకీయపార్టీలు ఓడిపోయినప్పుడల్లా లేనిపోని అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. వాటి నిజాయితీని శంకిస్తూ కోర్టుల్లో పిటిషన్లు వేస్తూనే ఉన్నాయి. ఇప్పటికి ఒకసారి రెండుసార్లు కాదు, దాదాపు 40 సార్లు కోర్టులు వాటిని తిరస్కరించాయి కూడా. ఈవీఎంలను తారుమారు చేయడం అసాధ్యమని, ఇవి నూటికి నూరుశాతం సురక్షితమైనవని ఎన్నికల సంఘం పలుసార్లు వాటి పనితీరుపై సాంకేతిక నిపుణుల చేత పరీక్షలు చేయించి ప్రదర్శించింది. ఈవీఎంల మీద అనుమానాలను నివృత్తి చేయడానికి వీవీప్యాట్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టింది. అంతేకాదు, ఎన్నికల్లో పోలింగ్‌కు ముందు వాటిని తనిఖీ చేసుకోవచ్చని అభ్యర్థులకు అవకాశం ఇస్తున్నారు కూడా. వాస్తవానికి ఈవీఎంల వల్ల ఎంతో ప్రయోజనం ఉందనే సంగతి అందరికీ తెలిసిందే. పోలింగ్ బూత్‌లను ఆక్రమించడం, ఓట్లను తొలగించడం, బ్యాలెట్ పేపర్లను చించేయడం వంటి పాతకాలపు అక్రమాలకు ఈవీఎంలతో చెక్ పెట్టినట్లయింది. ఈవీఎంలు ఎంతో భద్రమైనవనే నమ్మకంతో పాటు, వాటిని నిర్వహించే ఎన్నికల వ్యవస్థపై ఓటర్లకు తిరుగులేని మంచి విశ్వాసం ఉంది. ఈవీఎంల వల్ల ఎన్నికల నిర్వహణ ఖచ్చితంగా ఉందని, ఫలితాల ప్రకటన సులభతరం కావడమే కాక వేగవంతం కూడా అయిందనే సంతోషం కూడా ప్రజల్లో ఉంది. అయినా, ఎన్నికలొచ్చినప్పుడల్లా ఈవీఎంలపై పదేపదే రాద్ధాంతాలు మొదలవుతూనే ఉండడం విచారకరం. ఇటీవల ఈవీఎంలను శంకిస్తూ కొందరు వేసిన పిటిషన్లలను సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆమూలాగ్రం పరిశీలించి వాటిని నిర్ద్వందంగా కొట్టివేయడం హర్షదాయకం. ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేయడం, పిటిషనర్లు కోరినట్లుగా పాత కాలం నాటి బ్యాలెట్ పేపర్లనే వాడాలనడం సరైనది కాదని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో తేల్చిచెప్పడం విశేషం. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో నమోదైన ఓట్లను వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చి చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను కూడా సుప్రీంకోర్టు ఈ సందర్భంగా తోసిపుచ్చింది. ఏ వ్యవస్థనైనా గుడ్డిగా ఆటంకపరచడం అవాంఛనీయమైన సంశయవాదానికి దారి తీస్తుందని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఈవీఎంలలోని ఓట్లను నూరుశాతం వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చుతూ లెక్కించడం అసాధ్యమనీ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఓ అసెంబ్లీ స్థానం పరిధిలోని 5 ఈవీఎంలను ర్యాండమ్‌గా ఎంపిక చేసి, వాటిలోని ఓట్లను వీవీప్యాట్ స్లిప్‌లతో పోల్చి చూస్తున్నారు. అలా కాకుండా వీవీప్యాట్ స్లిప్‌లు అన్నింటినీ లెక్కించాలన్న పిటిషనర్ల డిమాండ్ సరికాదని తేల్చిచెప్పింది. ఈవీఎంల విధానంలోని లోపాలను చెప్పడంలో తప్పులేదని, అయితే వాటిని మెరుగుపరచుకునేలా సూచనలివ్వకపోగా, అపోహలు సృష్టించి వ్యవస్థపై అపనమ్మకం కలిగేలా చేయడం తగదని సుప్రీంకోర్టు ధర్మాసనం హితవు పలికింది. కాలపరీక్షలకు ఈవీఎంలు నెగ్గాయని, ఓటింగ్‌శాతం పెరగడం కూడా ప్రస్తుత వ్యవస్థపై ఓటరు విశ్వాసాన్ని తెలియజేస్తుందని పేర్కొంటూ, ఈవీఎంలు దుర్వినియోగం అయినట్లు పిటిషనర్లు ఒక్క దృష్టాంతాన్ని కూడా చూపలేకపోయారని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడా ద్విసభ్య ధర్మాసనం ఆ పిటిషన్లను కొట్టివేసింది. అయితే, ఇదే సందర్భంలో వీవీప్యాట్ స్లిప్‌ల కౌంటింగ్‌కు ఎలక్ట్రానిక్ యంత్రాలను సమకూర్చుకునే ఆలోచన చేయాలంటూ ఎన్నికల సంఘానికి కూడా సుప్రీంకోర్టు పలు సూచనలు చేసింది. ఏదేమైనా, ఏ పార్టీ అయినా సరే, తాము గెలవడానికి ప్రజల్లో ఆదరణ సంపాదించుకోవాలే తప్ప, ఈవీఎంలపై నెపం వేయడం, ఆ వ్యవస్థపైనే అనుమానించడం సముచితం కాదు. ఇకనైనా ఇలాంటి లేనిపోని అనుమానాలు, వివాదాలకు స్వస్తి పలకడం మంచిది.

# మన వెంకయ్యకి 'లాయర్' అక్షరాభిషేకం... బాగుంది!




మాజీ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరు గర్వించదగిన వ్యక్తి, నిబద్ధత కలిగిన రాజకీయ నేత వెంకయ్యనాయుడు 'పద్మ విభూషణ్' సత్కారాన్ని అందుకోవడం సంతోషకరం. దేశంలో రెండవ అత్యున్నత పురస్కారం 'పద్మవిభూషణ్'. వెంకయ్య ఆ గౌరవాన్ని అందుకున్న సందర్భంగా మన 'లాయర్' ఆయనకి ఘన నీరాజనాలు అర్పించింది. వెంకయ్య ప్రతిభకి, ఆయన ప్రస్థానానికి అక్షరాభిషేకం చేసింది. వెంకయ్య అధికారంలో ఉన్నప్పుడు ఆయన అడుగులకు మడుగులొత్తిన కొంతమంది పెద్దలు, ఆయనని అడ్డం పెట్టుకుని పైరవీలు చేసి అక్రమ సంపాదనకు పూనుకున్న కొన్ని మీడియా సంస్థలు ఈ సందర్భానికి సముచిత ప్రాధాన్యత కల్పించకపోవడం వారి కుసంస్కారాన్ని బయటపెడుతోంది. నెల్లూరోళ్ళు ప్రపంచంలో ఎక్కడ ఏ ఘనత సాధించినా వారిపై ప్రశంసలు కురిపిస్తూ.. వారి గురించి తమ పాఠకులకి, తద్వారా సమాజానికి తెలియజేయడంలో 'లాయర్' పోషిస్తున్న పాత్ర అభినందనీయం. ఎదుట వ్యక్తి గౌరవించబడినా, అనూహ్యమైన గుర్తింపును సాధించినా ప్రశంసించాలంటే సానుకూల దృక్పథం ఉండాలి. ఆ లక్షణం మన 'లాయర్'కి పుష్కలంగా ఉందన్నది నా అభిప్రాయం.

**ఎం. చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.**

# కనిపించని చలివేంద్రాలు!

పాత రోజుల్లో ఎండాకాలం వచ్చిందంటే వీధికొక చలివేంద్రం వెలిసేది. ఆయా ప్రాంతాలలోని ప్రజలు స్వచ్ఛందంగా తమ ఇంటి ముందో, లేక నాలుగురోడ్ల కూడళ్ళలోనో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగో, మంచినీళ్ళో పోసేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితే కరువైంది. ఎండల్లో అల్లాడేవారిపై ఎవరికీ కనికరం కలగడం లేదు. ఎన్నికల వేళ వాడవాడలా తిరుగుతున్న రాజకీయ నాయకులకి, వారి అనుయాయులకి కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్న స్పృహ లేకపోవడం దారుణం. ముఖ్యంగా పల్లె ప్రాంతాల నుండి ఆసుపత్రులకు వచ్చే రోగుల కోసం నగరంలోని పొగతోట వంటి ప్రాంతాలతో పాటు బస్‌స్టాండులలో కూడా ఈ చలివేంద్రాల అవసరం చాలావుంది. ఒక్క నగరంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో కూడా బస్‌స్టాండులలో, ఆసుపత్రుల వద్ద చలివేంద్రాలు పెడితే చాలామంది దాహం తీరుతుంది. జిల్లాలో రోటరీ, లయన్స్, జేసీస్ వంటి అనేక స్వచ్ఛంధ సేవాసంస్థలతో పాటు సామాజిక స్పృహతో పనిచేసే చారిటబుల్ ట్రస్టులు కూడా ఎన్నో ఉన్నాయి. వారితో పాటు సహృదయం కలిగిన దాతలకు కూడా నెల్లూరుజిల్లాలో కరువులేదు. ఇప్పటికైనా వారందరితో పాటు రాజకీయ నేతలు కూడా మేల్కొని ప్రజల దాహాన్ని తీరిస్తే.. పుణ్యం పురుషార్థం రెండూ దక్కుతాయి.

**కే. లక్ష్మణసింగ్, బుజబుజనెల్లూరు.**




# వేసవి సెలవులు..చిన్నారులకు విజ్ఞానపు సిరులు

వేసవి వచ్చిందంటే చాలు.. అది ఎంతగా మండుతున్నా చిన్నారులకు మాత్రం చల్లనికుండలాగే అనిపిస్తుంటుంది. ఎందుకంటే, బడులకు సెలవులు వచ్చేస్తాయి కనుక. వేసవి సెలవులంటే పిల్లలకు పండుగే. పుస్తకాలు మూలనపెట్టేసి హాయిగా ఆటపాటలతో ఆనందంగా గడిపేస్తుంటారు. అయితే, ఎంత పండుగైనా ఇప్పుడు భయంకరంగా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల్లో చిన్నారులు ఇంటిపట్టునే.. నీడలో ఉండడం, చల్లని మంచినీళ్లు లేదా మజ్జిగ తరచూ తాగుతూ వేసవి వడదెబ్బకు గురికాకుండా చూసుకోవడం ఎంతో ముఖ్యం. అంతేకాదు, సెలవులు దొరికాయి కదాని చెరువులు దొరువుల దగ్గరకి, బావులు, నీళ్లగుంటల్లో ఈతకు దిగడం మాత్రం ఎంతో ప్రమాదం. ప్రత్యేకించి ఈ ఎండల్లో తల్లితండ్రులు ఏమారిపోకుండా పిల్లలను కంటికి రెప్పలా కనిపెట్టుకుని ఉండాలి. ఇకపోతే, ఆటపాటలు శారీరక దృఢత్వానికి, మానసిక వికాసానికి కూడా ఎంతో ఉపకరిస్తాయి కాబట్టి ఆ ఆటలు కూడా భవిష్యత్తుకు ప్రయోజనకారిగా ఉండేవాటిని ఎంపిక చేసుకుంటే మంచిది. ఆరుబయట ఆడుకునే ఆటలతో పాటు, ఇంట్లోనే ఆడుకునే చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్‌ను కూడా తల్లితండ్రులు పిల్లలకు అలవాటు చేయాలి.

అన్నిటికంటే ముఖ్యంగా ఇప్పుడు 1 నుంచి 10వ తరగతి దాకా చదివే విద్యార్థులకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కాబట్టి, దాదాపు ఈ ఒకటిన్నరనెల కాలాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలి. పిల్లలతో వీలైనంత ఎక్కువసేపు గడపడం, వారి రుచులు, అభిరుచులు తెలుసుకోవడం, వారి మనసులను ఆకట్టుకుంటూ వారికి సమాజంలో నైతిక విలువలతో ఎలా రాణించాలో సందర్భానుసారంగా తెలియజెప్తుండడం ఎంతో అవసరం. చిన్నతనం నుంచే పిల్లలకు దేశభక్తిని, దైవభక్తిని ప్రబోధిస్తూ, తల్లితండ్రుల పట్ల, గురువుల పట్ల, పెద్దల పట్ల గౌరవభావం కలిగేలా చూసేందుకు, వారిలో నైతిక విలువలు పెంపొందించేందుకు ఇంతకంటే మంచిసమయం ఏముంటుందీ?..

## పిల్లల కోసం పెద్దలు సమయం కేటాయించాలి

ఈ వేసవి రోజుల్లో దాదాపు ప్రతిచోటా అనేక సంస్థలు వేసవి శిబిరాలు నిర్వహిస్తుంటారు. గ్రంథాలయాల్లో చిన్నారులకు పుస్తకపఠనం పట్ల ఆసక్తిని కలిగిస్తుంటారు. మంచి కథలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదువుకునే అలవాటు చేసేందుకు వారిని గ్రంథాలయాలకు తీసుకువెళ్లాలి. అందుకోసం పెద్దలు తమ సమయాన్ని తప్పనిసరిగా కేటాయించాలి. కుదురుగా కూర్చుని నేర్చుకునే చిత్రలేఖనం, వ్యాసరచన వంటి వాటిల్లో తర్ఫీదునిప్పించాలి. ఏకాగ్రత కలిగించే కళలు, ఆటపాటల్లో పాల్గొనేలా వారిని ప్రోత్సహించాలి. శాస్త్రీయ నృత్యాలు, వీణ, కీబోర్డు వంటి సంగీత వాద్యాలు పలికించడంలోను వారి ఆసక్తిని బట్టి గురువుల వద్ద శిక్షణ ఇప్పించాలి. చదువు పట్ల, మాతృభాష పట్ల వారికి మమకారాన్ని కలిగిస్తూ, రాసేటప్పుడు, చదివేటప్పుడు తప్పులు దొర్లకుండా ఉండేలా నేర్పాలి. వక్తృత్వ పోటీల్లో కూడా ధైర్యంగా పాల్గొనే విధంగా అలవాటు చేయాలి. పిల్లలు ఎలా ఉంటే బాగుంటుందని అనుకుంటున్నారో గమనించి, వారి ఇష్టాయిష్టాలను తెలుసుకుని మసలుకోవాలి. పిల్లలు పక్కదారి పట్టకుండా, వివేకం..విజ్ఞానంతో రాణించేలా తీర్చిదిద్దుకోవాలి.

## చీటికీమాటికీ తిట్టడం, కొట్టడం మంచిది కాదు

అమ్మానాన్నలు తమపట్ల ఎంతో ప్రేమతో ఉన్నారని పిల్లలు గ్రహించుకునేలా పెద్దలు తమ ప్రేమను పంచాలి. అంతే తప్ప, వారంటే భయపడిపోయే స్థితికి తీసుకోరాకూడదు. పిల్లల పట్ల కఠినంగా వ్యవహరించడం, చీటికీ మాటికీ తిట్టడం, కొట్టడం వంటివి ఎప్పటికీ మంచిది కాదు. పిల్లలు ఒకవేళ ఏదైనా తప్పుచేసినా వారు సరిదిద్దుకునేవిధంగా చూడాలే తప్ప, పరుష మాటలతో బాధించడం సరికాదు. ఏది మంచో-ఏది చెడో మృదువుగానే వారికి తెలియజెప్పాలి. దురలవాట్లకు దూరంగా ఉండేలా ఇప్పటినుంచే వారిని క్రమశిక్షణతో, జాగ్రత్తగా పెంచుకోవాలి. వారికి ఇష్టమైన ప్రాంతాలకు, లేదా విహారయాత్రలకు తీసుకువెళ్ళి వాళ్ళలో మరింత ఉత్సాహం కలిగించాలి. పౌష్టికాహారంతో పాటు వారికేది ఇష్టమో అలాంటి పిండివంటలు చేసిపెట్టాలి. వారి ఆరోగ్యం పట్ల అన్నివేళలా ఎంతో జాగ్రత్త వహించాలి. వారి ప్రవర్తనను అనుక్షణం గమనిస్తూ, వారు మంచిదారిలో ఉండేలా చూసుకోవాలి. ఏదేమైనా, పిల్లల పట్ల ఆత్మీయంగా ఉంటూ వారిలో ఉన్న నైపుణ్యాలను, సృజనాత్మకతను మెరుగులు దిద్ది ప్రోత్సహించడానికి, వారిలో విజ్ఞానాన్ని పెంపొందించడానికి, వారి భవితను చిన్నతనం నుంచే తీర్చిదిద్దుకోవడానికి ఇదే చక్కని తరుణం.

ఒక్కమాటలో చెప్పాలంటే ఇలాంటి వేసవి సెలవులు చిన్నారులకు విజ్ఞానపు సిరులే. పిల్లలతో పాటు పెద్దలు కూడా వాటిని సద్వినియోగం చేసుకోవాలి. పిల్లలతో కలసి ఆడుతూపాడుతూ వారి ఆనందంలో పాలు పంచుకోవడం కంటే సంతోషం ఇంకేముంటుందీ!.. నేటి పెద్దలు కూడా ఒకప్పటి పిల్లలే కదా! అందుకే వేసవి సెలవులను మీరు కూడా సద్వినియోగం చేసుకోండి!.. మీ పిల్లలతో మీరు కూడా ఈ సెలవుల్లో హాయిగా.. ఆనందంగా గడపండి!..

**- రాజశ్రీ**

# సమాజాన్ని బాగు చేయాలన్నదే వేమిరెడ్డి దంపతుల లక్ష్యం!

## - బుచ్చిరెడ్డిపాళెం సభలో చంద్రబాబు



సమాజాన్ని బాగు చేయాలన్న లక్ష్యం ఎంతో ఉన్నతమైందని, ఆ లక్ష్యంతోనే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతిరెడ్డి దంపతులు రాజకీయాల్లోకి వచ్చారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. డబ్బు సంపాదించడానికి వేమిరెడ్డి దంపతులు రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారని ఆయన ప్రశంసించారు. కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెంలో ఇటీవల నిర్వహించిన 'ప్రజాగళం' బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాసేవ వేమిరెడ్డి దంపతుల లక్ష్యమని, ప్రజలందరూ కోవూరు ఎమ్మెల్యేగా ప్రశాంతిరెడ్డిని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రజల ఉత్సాహం చూస్తుంటే వేమిరెడ్డి దంపతుల గెలుపు ఖాయమయ్యిందన్నారు. అవినీతి రాజకీయాలు చేసి, అక్రమార్జన చేసే స్వభావం జగన్, ప్రసన్నలదని ఆయన విమర్శించారు. రాజకీయాలంటే ప్రజాసేవ, ప్రజలకు మంచి చేయాలన్నది వేమిరెడ్డి కుటుంబ స్వభావమన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్నందుకు ఆ మహిళపై కూడా దారుణంగా విమర్శలు చేశారని, వాటిని కూడా తట్టుకుని ప్రశాంతిరెడ్డి ధైర్యంగా పోరాడుతున్నారని చంద్రబాబు ఆమెను అభినందించారు. మద్యం నుంచి ఇసుక వరకు వైకాపా చేస్తున్న అక్రమాలపై చంద్రబాబు మండిపడ్డారు.

## అవినీతికి కేరాఫ్ అడ్రస్.. ప్రసన్నే

**- విపిఆర్ మండిపాటు**

కోవూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అవినీతి తప్ప ఇంకేం కనిపించడం లేదని, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ప్రసన్నకుమార్‌రెడ్డి పాలన సాగించారని నెల్లూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. అవినీతిరహిత పాలన అందించేందుకే తాము రాజకీయాల్లోకి వచ్చామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి టీడీపీని గెలిపించాలని, చంద్రబాబు నాయుడును సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధికారప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్నకు రాజకీయభిక్ష పెట్టింది టీడీపీయే - ప్రశాంతిరెడ్డి

ఈ సభలో కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, కోవూరు నియోజకవర్గాన్ని ప్రసన్నకుమార్‌రెడ్డి అవినీతిమయంగా మార్చేశారని, కోవూరు నియోజకవర్గం ఇసుక గ్రావెల్ మాఫియాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. కమీషన్లకు కక్కుర్తిపడి కోవూరు షుగర్ ఫ్యాక్టరీ రైతులకు పరిహారం అందివ్వకుండా జాప్యం చేస్తూ రైతుల ఆత్మహత్యలు చేసుకునే దుస్థితికి ప్రసన్నే కారణమని దుయ్యబట్టారు. విశాఖలో భూకబ్జాలకు పాల్పడ్డ విజయసాయిరెడ్డి ప్రసన్నతో కలిసి ఇఫ్కో భూములు, షుగర్ ఫ్యాక్టరీ భూములు స్వాహా చేసేందుకు నెల్లూరు వచ్చాడని ఆమె విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా తనను గెలిపించి ప్రసన్నను ఇంటికి సాగనంపాలని కోరారు. ఎమ్మెల్యే అవినీతిని ప్రశ్నిస్తే పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తూ ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నాడన్నారు. ప్రసన్నకుమార్ రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. ఆరుసార్లు గెలిచానని గొప్పలు చెప్పుకుంటున్న ప్రసన్న నాలుగు పర్యాయాలు గెలిచింది టీడీపీ నుంచే అనే విషయం మరచిపోకూడదన్నారు. తాము వెన్నుపోటుదారులం అంటున్న ప్రసన్న, టిడిపికి వెన్నుపోటు పొడిచి వైసీపీలో ఉన్నాడు కదా అని ఆమె అన్నారు.

➢ ప్రజాసేవే పరమావధి అంటున్న ప్రభాకరరెడ్డి

# వింజమూరులో వీపీఆర్‌కు బ్రహ్మరథం



వింజమూరులో నెల్లూరు పార్లమెంట్ ఎన్‌డీఏ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన రోడ్ షోకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. వింజమూరులోని బంగ్లా సెంటర్ నుంచి ప్రారంభమైన రోడ్‌షో.. ఆద్యంతం ప్రజల హర్షధ్వానాల మధ్య ఉత్సాహంగా సాగింది. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలవాల్సిన ఆవశ్యకతను వారు వివరించారు. వైసీపీ పాలనలో ప్రజలు ఎలా ఇబ్బందులు పడ్డారో పేర్కొన్నారు. రోడ్‌షో అనంతరం కొత్తూరు సమీపంలోని కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైకాపా ముఖ్య నాయకులు గువ్వల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 100 కుటుంబాలు వైకాపాకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరాయి. విపిఆర్, కాకర్ల సురేష్ టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో వింజమూరు చాలా వెనుకబడిన ప్రాంతమన్నారు. యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని, ఉద్యోగాలు కావాలన్నా, వలసలు ఆగాలన్నా.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబుని గెలిపించుకొంటే ప్రజల అవస్థలు తొలగిపోతాయని, టీడీపీ వస్తే సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలందరికీ మేలు జరుగుతుందని చెప్పారు.

# ఆత్మకూరులో కనిపించేది.. ఆనం చేసిన అభివృద్ధే



ఆత్మకూరుకు మేకపాటి కుటుంబం చేసింది శూన్యమని, ఆత్మకూరులో ఇప్పటికీ ఆనం రామనారాయణరెడ్డి చేసిన అభివృద్ధే కనిపిస్తోందని నెల్లూరు పార్లమెంట్ ఎన్డీఏ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామానారాయణరెడ్డి ఆధ్వర్యంలో మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో ఎన్‌డీఏ కూటమి గెలిస్తేనే ఈ రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. మేకపాటి కుటుంబం అనేక ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారని, ఎంపీగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా పదవులేలారు గానీ మర్రిపాడు మండల రైతులకు ఎంతో మేలుచేసే సోమశిల హై లెవల్ కెనాల్ గురించి ఏనాడైనా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. కనీసం రోడ్డు, మురుగు కాలువలు నిర్మించిన చరిత్ర కూడా లేదు. అందుకే ఈసారి ఆత్మకూరు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు సిద్ధం అయ్యారన్నారు. వైసీపీ మేనిఫెస్టో ఫ్లాప్ అని, టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు బంపర్ హిట్ అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఆనం రామనారాయణరెడ్డితో పాటు ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్య నాయుడు, కంభం విజయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ● మనసున్న దాత.. ఆదర్శ అన్నదాత..

## క్యాన్సర్ ఆసుపత్రి స్ఫూర్తిప్రదాత

# జే.ఎస్.రెడ్డి... ఇక లేరు

*ప్రముఖ కాంట్రాక్టర్, సంఘసంస్కర్త, సమాజ సేవకుడు, కళారాధకుడు, క్రీడాభిమాని, ఆదర్శరైతు జే.ఎస్.రెడ్డి ఇక లేరు. మే1వ తేదీ ఉదయం సుమారు 8.00 గంటలకి బెంగళూరులోని వారి నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత మార్చి 8న 79 సంవత్సరాలు పూర్తిచేసుకుని 80వ పడిలో అడుగుపెట్టారు జే.ఎస్.రెడ్డి. జిల్లాలో పేరుమోసిన జక్కా సోదరులలో జే.ఎస్.రెడ్డి మూడవవాడు. ఆయన అన్న రాధాకృష్ణరెడ్డి కారు ప్రమాదంలో కన్నుమూశారు. మరో అన్న జే.కే.రెడ్డి మాజీ శాసనసభ్యుడిగా, విలువలున్న రాజకీయ నాయకుడిగా ప్రసిద్ధి. మరో సోదరుడు శివనారాయణరెడ్డి కూడా కాంట్రాక్టర్‌గా స్థిరపడ్డారు. జక్కా రంగారెడ్డి - కామేశ్వరమ్మల మూడవ సంతానంగా 1945 మార్చి 8న శీనయ్య జన్మించారు. వీరి స్వగ్రామం జగదేవిపేట.*

నెల్లూరు జిల్లాలో క్యాన్సర్ రోగులకు వరంలా ఏర్పడ్డ "జక్కా సుజాతమ్మ క్యాన్సర్ డిటెక్షన్ కేంద్రం" వ్యవస్థాపనలోనూ, చిన్నారుల ఆహ్లాదం కోసం లక్షల రూపాయలు వెచ్చించి రూపొందించిన చిల్డ్రన్స్‌పార్కు నిర్మాణంలోనూ, నగరంలోని పురమందిరాన్ని పునర్నిర్మించడంలోనూ, జిల్లాలో పామ్‌ఆయిల్ సాగును ప్రోత్సహించడంలోనూ ముఖ్యపాత్ర పోషించిన ఘనత జే.ఎస్.రెడ్డిది.

### జీవిత విశేషాలు!

జే.ఎస్.రెడ్డి పూర్తి పేరు జక్కా శ్రీనివాసులరెడ్డి అయినా జే.ఎస్.రెడ్డిగా ఆయన ప్రసిద్ధి. పేరుగాంచిన కాంట్రాక్టరుగా, కర్నాటక రాష్ట్రంలో తెలుగువారి కీర్తిని దశదిశలా వ్యాపింపజేస్తూ ఎందరికో ఆదర్శప్రాయుడిగా నిలిచిన సంఘసంస్కర్తగా ఆయనని తెలియని వారు బహుశా బహు అరుదు. ఆయన బాల్య విద్యాభ్యాసం స్వగ్రామంలోనూ, నెల్లూరు వీ.ఆర్.కళాశాలలోనూ గడిచింది. 1964 నుండి 1968 వరకు తిరుపతిలో వ్యవసాయ శాస్త్రం చదువుకున్నారు. ఆయనకు స్కూల్‌లో చదువుకునే రోజులనుండి క్రీడలపట్ల మక్కువ ఎక్కువ. అదే ఆసక్తిని కాలేజీలో కూడా కొనసాగించారు. వాలీబాల్, టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, క్యారమ్స్, చెస్‌లతో పాటు మహిళలు ఎక్కువగా ఆడే రింగ్‌బాల్‌ను కూడా ఆయన వదిలేవారు కాదు. ఆటలంటే ఆయనకి అంత పిచ్చి. 'జాక్ ఆఫ్ ఆల్ ట్రేడ్స్-మాస్టర్ ఆఫ్ నన్' అని మిత్రులు శ్రీనివాసులురెడ్డిని సరదాగా పిలుచుకునేవారు.



అగ్రికల్చర్ బి.ఎస్సీ అవగానే ఎం.ఎస్సీ చేయాలి.. ఇదీ శ్రీనివాసులరెడ్డి లక్ష్యం. కానీ అనుకోని పరిస్థితులలో తండ్రి ఆదేశం మేరకు ఆయన తన మేనమామ గునపాటి హరిశ్చంద్రారెడ్డి పంచకి చేరారు. అప్పటికే తన మిత్రుడి భాగస్వామ్యంలో అసోసియేటెడ్ బిస్కట్ ఫ్యాక్టరీని నడుపుతుండిన హరిశ్చంద్రారెడ్డి, శ్రీనివాసులరెడ్డిని ఫ్యాక్టరీలో పని నేర్చుకోమని చెప్పారు. శీనయ్య అక్కడ కొన్ని నెలల పాటు పని చేశారు. ఆ తరువాత తన మరో మామ పులగం దశరథరామిరెడ్డి గుల్బర్గాలో చేస్తున్న కాంట్రాక్టు పనులపట్ల ఆయన ఆసక్తి చూపించారు. ఆనాడు తీసుకున్న నిర్ణయం శ్రీనివాసులరెడ్డి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవడానికి బాగా ఉపయోగపడింది. గుల్బర్గాలో కొద్దికాలం ఉన్న తరువాత అక్కడి నుండి తిరుపతి రెండవ ఘాట్‌రోడ్డు పనుల పర్యవేక్షణకు మేనేజర్‌గా వచ్చారు. 1969 నుండి 1972 వరకు మూడేళ్ళపాటు అక్కడే ఉండిపోయారు. అక్కడ ఉన్నప్పుడే 1970, సెప్టెంబర్ 2వ తేదీ సౌదామినిని తన జీవితభాగస్వామిగా చేసుకున్నారు.

### స్వయం ప్రకాశం...

1972 నుండి తనే సొంతంగా కాంట్రాక్టు పనులు చేయడం ప్రారంభించారు. ముందుగా 1974 వరకు రెండేళ్ళ పాటు కర్ణాటకలో కాంట్రాక్టులు చేశారు. క్రమేణా ఆయన కాంట్రాక్టర్ జే.ఎస్.రెడ్డిగా ప్రాచుర్యాన్ని పొందడం మొదలయ్యింది. 74-76 మధ్య కాలంలో గుజరాత్‌లో వర్కులు చేశారు. మళ్ళీ 76-82 సంవత్సరాల మధ్య అప్పర్ కృష్ణా కెనాల్ పనులు చేశారు. ఇక్కడినుండి ఆయన వెనుతిరిగి చూడలేదు. 82-86 మధ్యకాలంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లను కలుపుతూ బెట్వా నదిపై నిర్మించిన రాజ్‌ఘాట్ డ్యామ్ పనులలో జే.ఎస్.రెడ్డి భాగస్వాములుగా ఉన్నారు. అప్పట్లో ఈ భారీ నిర్మాణ పని అతిపెద్ద కాంట్రాక్టు పనిగా అందరూ చెప్పుకోవడం విశేషం. అనంతరం 1986 నుండి మళ్ళీ గుజరాత్‌లో తన ప్రస్థానాన్ని కొనసాగించి 86-92 సంవత్సరాల మధ్య ఆరేళ్ళ పాటు నర్మద మెయిన్ కెనాల్ పనిని 50 నుండి 58వ కిలోమీటర్ వరకు రికార్డ్ టైంలో పూర్తిచేసి జాతికి అంకితం చేసినందుకుగాను అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి చిమన్‌భాయ్ పటేల్ నుండి జే.ఎస్.రెడ్డి బంగారు పతకాన్ని అందుకున్నారు. జే.ఎస్.రెడ్డి చేసిన మొట్టమొదటి ప్రపంచబ్యాంకు పని కూడా అదే.

### రోగుల ప్రాణప్రదాత క్యాన్సర్ ఆసుపత్రి...



క్యాన్సర్ వచ్చిన వారు తమకు వచ్చింది క్యాన్సరో కాదో అని తెలుసుకునేందుకు అప్పట్లో ఎంతో వ్యయప్రయాసలు పడి మద్రాసుకు వెళ్లాల్సివచ్చేది. కొంతమందైతే తమకు వచ్చింది క్యాన్సర్ కాదనుకుని, ఆ జబ్బు బాగా ముదిరిపోయి ప్రాణాలమీదికి వచ్చేదాకా తెలుసుకోలేకపోయేవారు. ఎలాగైనా సరే నెల్లూరులో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రమేకాక, చికిత్సలకు మళ్లీ రోగులు మరెక్కడికో పరుగులు తీస్తూ ఇబ్బందులు పడకుండా నెల్లూరులోనే అన్ని సదుపాయాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించుకున్నారు జే.ఎస్. అదే ఇప్పుడు నెల్లూరు నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న రెడ్‌క్రాస్ జక్కా సుజాతమ్మ క్యాన్సర్ ఆసుపత్రి. తన వదినమ్మ జక్కా సుజాతమ్మ పేరుమీద ఆ ఆసుపత్రిని నిర్మించి ఆమె పేరును శాశ్వతం చేశారాయన. అనేకమంది దాతల వదాన్యతతో ఈ ఆసుపత్రి అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూనే ఉంది. అయితే క్యాన్సర్ రోగుల కోసం అంతగా తపించిన జే.యస్.రెడ్డి సతీమణి సౌదామినిని కూడా అదే క్యాన్సర్ పొట్టనపెట్టుకోవడం బాధాకరం. 2009 జూలై 6న ఆమె దివంగతురాలైనారు.

### సొంత పేరుతో సంస్థ...

అప్పటివరకు తన పేరు మీదనే వ్యక్తిగతంగా పనులు చేస్తుండిన శ్రీనివాసులరెడ్డి 1992లో జెఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో సంస్థను ప్రారంభించారు. అక్కడి నుండి మరో పదేళ్ళ పాటు తిరుగులేని సంస్థగా తమ సంస్థను తీర్చిదిద్ది గుజరాత్‌లో 2002వరకు తన ప్రతిభతో ఎన్నో పనులను విజయవంతంగా పూర్తిచేశారు.

### పిల్లల చదువుల కోసం బెంగుళూరుకు

జే.ఎస్.రెడ్డికి ఇద్దరు పిల్లలు. కుమార్తె రాధిక, కుమారుడు భక్తవత్సలరెడ్డి. పిల్లలు పెరిగి పెద్దవారవుతున్న దృష్ట్యా వారి చదువుల కోసం 1981లో తన నివాసం బెంగుళూరుకు మార్చారు. బెంగుళూరు రాజకీయ, పారిశ్రామిక ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాయి. అతి స్వల్పకాలంలోనే నగరంలోని అత్యంత ప్రముఖులలో తానూ ఒకరిగా ఎదిగారు. ఒకానొక దశలో జే.ఎస్.రెడ్డితో పరిచయం కోసం చాలామంది సెలబ్రిటీలు సైతం ఆసక్తి చూపే స్థాయికి ఆయన పేరు, పరపతి పెరిగాయి.

### ఆదాయపన్ను శాఖ నుండి అవార్డు

కర్ణాటక-గోవా రీజియన్‌లలో క్రమం తప్పకుండా రెగ్యులర్‌గా అత్యధిక ఆదాయ పన్ను చెల్లించిన వ్యక్తిగా 2000 సంవత్సరంలో ఆదాయపన్ను శాఖ (ఇన్‌కమ్ టాక్స్ డిపార్టుమెంటు) నుండి ప్రశంసలతో కూడిన అవార్డును జే.ఎస్.రెడ్డి అందుకోవడం విశేషం.


### వ్యవసాయంపై మక్కువ...

చిన్న తనం నుండి తనకి ఇష్టమైన వ్యవసాయాన్ని ఆయన వదిలేయలేదు. 1994 నుండి జిల్లాలో పామాయిల్ సాగును ఆయనే తొలుతగా ప్రారంభించి రైతులకు ఆదర్శంగా నిలిచారు. రైతులను ప్రోత్సహించడం కోసం స్వయంగా 1997వ సంవత్సరంలో నెల్లూరు జిల్లా మనుబోలు ప్రాంతంలో సింహపురి ఆగ్రోప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పామ్ ఆయిల్ కర్మాగారాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించారు. ఈ ఫ్యాక్టరీ ఆధారంగా జిల్లాలో పామ్ ఆయిల్ సాగును ప్రోత్సహించారు.

### తల్లి పేరుతో ఆసుపత్రి...

తమ స్వగ్రామం జగదేవిపేటలో ఎవరికి బాగలేక పోయినా నెల్లూరుకు వైద్యం కోసం పరుగులుతీస్తుండేవారు. ఆ బాధల నుంచి తమ ఊరి ప్రజలను గట్టెక్కించాలనే ఉద్దేశ్యంతో అప్పట్లోనే కొన్ని లక్షల రూపాయలు వెచ్చించి ప్రజల వైద్యం కోసం జగదేవిపేటలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని నిర్మాణం చేయించడమే కాక, ఆ ఆసుపత్రికి తమ మాతృమూర్తి జక్కా కామేశ్వరమ్మ పేరును నామకరణం చేయించి తనకు జన్మనిచ్చిన తల్లి పేరు శాశ్వతంగా ఉండేలా చేశారు.

### మురికి కూపాన్ని.. 'చిల్డ్రన్స్‌పార్కు'గా తీర్చిదిద్దారు :



నెల్లూరు నగరానికి జెఎస్‌రెడ్డి అందించిన సేవల్లో నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కు' ఒకటి. నగరంలోని ఆదిత్యనగర్ వద్ద ఉన్న సుమారు ఆరెకరాల మునిసిపాలిటీ డంపింగ్‌యార్డు ఉన్నచోట జన్మభూమి పథకంలో పార్కును కట్టించాలని అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ విషయం జే.ఎస్.రెడ్డి దృష్టికి రావడంతో జన్మభూమి పథకంలో పార్కు పనులు చేపట్టడానికి ఆయన సహృదయంతో ముందుకు వచ్చారు. కొద్దినెలల్లోనే ఆ మురికి కూపం కాస్తా అందమైన పార్కుగా రూపుదిద్దుకుంది. అప్పట్లో భారీ వ్యయంతో ఈ పార్కు నిర్మాణం జరిగితే, జే.ఎస్.రెడ్డి తనవంతుగా లక్షలాది రూపాయలు ఈ పార్కు కోసం వెచ్చించారు. పార్కును అందంగా తీర్చిదిద్ది నెల్లూరు ప్రజలకు అంకితం చేసి చిన్నపిల్లల పట్ల తనకున్న ప్రేమాభిమానాలను చాటుకున్నారు. దానికి 'చిల్డ్రన్స్‌పార్కు' అనే పేరే స్థిరపడిపోయింది.

### జే.ఎస్.రెడ్డి ట్రస్టు ఏర్పాటు...

తన సొంత పేరుమీద ఒక ట్రస్టును ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టు కోసం పెద్దమొత్తం బ్యాంకులో డిపాజిట్ చేసి, అనారోగ్యంతో బాధపడుతూ అధిక భారంతో వైద్యానికి దూరమౌతున్న పేదలకు ఉచిత వైద్యసేవలను అందించడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రధాన అంశాలుగా పెట్టుకుని ట్రస్టు కార్యక్రమాలను నిర్వహించేవారు. ప్రతియేటా ఎంతోమంది పేద విద్యార్థినీ విద్యార్థుల చదువుల కోసం కూడా తనవంతు చేయూతను అందించారు. క్రీడలపై ఆయనకున్న మక్కువతో ఆ రంగాన్ని కూడా ఈ ట్రస్టు ద్వారా ప్రోత్సహించారు.



### టౌన్‌హాలుకు కొత్త వెలుగులు :

నెల్లూరుకు టౌన్‌హాలును(పురమందిరం) నిర్మించి నెల్లూరుకు అదొక ల్యాండ్‌మార్కులా తయారుచేసిన ఘనకీర్తి రేబాల వారిది. 2001వ సంవత్సరంలో నెల్లూరు టౌన్‌హాలులో తమతండ్రి జక్కా రంగారెడ్డి స్మారకంగా జక్కా రంగారెడ్డి కళాపీఠం పద్యనాటక పోటీలు నిర్వహిస్తున్న సందర్భంలో ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రఖ్యాత సినీనటుడు సోమయాజులు (శంకరాభరణం శంకరశాస్త్రి) టౌన్‌హాలు పైకప్పు దెబ్బతిని శిథిలావస్తకు చేరుకుంటుండడం చూసి బాధపడి టౌన్‌హాలు పునరుద్ధరణకు దాతలెవరైనా ముందుకు వస్తే బాగుంటుందని కోరడం, సభలోనే ఉన్న జే.ఎస్ అందుకు ఓయస్ అనడం జరిగిపోయాయి. టౌన్‌హాలు కమిటీ ఆమోదంతో మరమ్మతులన్నీ చకచకా పూర్తి చేయించి, సిమెంటు బెంచీల స్థానంలో ప్లైవుడ్ కుర్చీలు వేయించారు. ఆధునికతతో రూపుదిద్దినా.. చరిత్రాత్మకమైన పాత టౌన్‌హాలు కట్టడాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాటికి కొత్త అందాలు సంతరించిపెట్టారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నెల్లూరు పురమందిరానికి సరికొత్త వెలుగులు తెచ్చిపెట్టిన మహాదాతగా.. కళాపోషకునిగా జే.ఎస్ అటు టౌన్‌హాలు చరిత్రలోనూ, ఇటు సింహపురి చరిత్రలోనూ శాశ్వతస్థానం సంపాదించుకున్నారు. 2003 సెప్టెంబరు 14వ తేదిన భారతీయ సినిమా గాయకులు, మన నెల్లూరీయులు.. గానగంధర్వులు దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతులమీదుగా దానిని పునః ప్రారంభింపచేశారు.

తండ్రి నుండి వచ్చిన కష్టపడే మనస్తత్వం, సతీమణి సౌదామిని నుండి అబ్బిన దాతృత్వం, పదిమందికీ సహాయపడాలనే తత్వం, మూర్తీభవించిన మానవత్వం జే.ఎస్.రెడ్డి సొంతం. విధి ఎంత విచిత్రమైనదో అనడానికి జే.ఎస్.రెడ్డి జీవితమే ఒక ఉదాహరణ. క్యాన్సర్ నివారణ కోసం నిరంతరం తపించిన జే.ఎస్.రెడ్డిని కూడా అదే క్యాన్సర్ ఇప్పుడు పొట్టన పెట్టుకుంది. జే.ఎస్.రెడ్డి నిష్క్రమణతో శోక సముద్రంలో ఉన్న జక్కా కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ, జక్కా శ్రీనివాసులరెడ్డి మృతికి అశ్రునివాళులర్పిస్తోంది 'లాయర్'.

➤ నగరాభివృద్ధే నా లక్ష్యం.. అంటున్న నారాయణ

# పొంగూరుపై పొంగుతున్న జనాదరణ



నెల్లూరు అభివృద్ధిప్రదాత నారాయణ అంటూ నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి, మాజీమంత్రి నారాయణ పట్ల ప్రజల ఆదరణ వెల్లువెత్తుతోంది. ఆయన సభలకు, ర్యాలీలకు ప్రజలు పెద్దసంఖ్యలో కదలి వస్తున్నారు. ఇటీవల ఆయన నెల్లూరులోని 15, 16 డివిజన్‌లలో ప్రచారానికి వచ్చినప్పుడు తండోప తండాలుగా ప్రజలు తరలివచ్చి ఆయనపై పూలవాన కురిపించి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తోన్న అరాచక, దౌర్జన్య పాలనతో ప్రజలందరూ విసుగెత్తిపోయారని, తెలుగుదేశం పార్టీకి రోజు రోజుకి ప్రజల ఆదరణ పెరుగుతోందని అన్నారు. జగన్ అరాచకాలను భరించలేక ఎంతోమంది ప్రశాంతమైన తెలుగుదేశం పార్టీలో చేరుతుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను పుట్టి పెరిగిన గడ్డ కాబట్టి నెల్లూరును అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రజలకు సేవచేస్తున్నానన్నారు. 2014 నుంచి 2019 వరకు మంత్రిగా ఉన్న సమయంలో ప్రజలు అడగకుండానే... ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందని గుర్తుచేశారు. అయితే ఆ పనులన్నిటినీ వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టేయడం దారుణమన్నారు. నిరుపేదలకి రూ.5లకే కడుపు నిండా అన్నం పెట్టే అన్న



క్యాంటీన్లను టీడీపీ ప్రభుత్వం తీసుకువస్తే, వాటిని కూడా జగన్ ప్రభుత్వం మూసేసి నిరుపేదల కడుపు కొట్టిందన్నారు. బారాషహీద్ దర్గా, షాదీమంజిల్, స్వర్ణాల చెరువు నెక్లెస్ రోడ్డు ఇలా ఎన్నో మంచి కార్యక్రమాలను చేశానని గుర్తు చేశారు. ఇవన్నీ వంద శాతం పూర్తవ్వాలంటే... మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే సాధ్యమవుతుందన్నారు. తాము అధికారంలోకి రాగానే..నెల్లూరుని నెం.1 మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు.

# నారాయణతోనే నెల్లూరుకు వెలుగు

## - బాలకృష్ణ ప్రశంస



నెల్లూరు నగరాన్ని 2014 నుంచి 2019 వరకు మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఎంతో అభివృద్ధి చేశారని, ఈ ఎన్నికల్లో నారాయణను తప్పనిసరిగా ప్రజలు గెలిపించుకుని, నగరాభివృద్ధికి సహకరించాలని యువనేత, హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల ఆయన నెల్లూరులో పెద్దఎత్తున రోడ్‌షో నిర్వహించి స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నారాయణ మంత్రిగా ఉన్నప్పుడు నిరుపేదల కోసం 43వేల ఇళ్లు నిర్మించారని.. అలాగే నెల్లూరుని దోమలు లేని నగరంగా మార్చేందుకు రూ.550 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ. 580 కోట్లతో సంగం బ్యారేజి నుంచి డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. నెల్లూరు నగరవాసుల చిరకాల కోరిక ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డును కూడా నిర్మించారని, నగరంలోని కోనేర్ల వద్ద ఘాట్‌లు, అందమైన పార్కులను ఎంతో అద్భుతంగా ఏర్పాటు చేశారని నారాయణను బాలకృష్ణ కొనియాడారు. ఆ పనులన్నీ దాదాపు 90 శాతం పూర్తయ్యాయని, ఇంతలో వైసీపీ ప్రభుత్వం వచ్చి, ఆ అభివృద్ధిపనులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అభివృద్ధి కావాలా, అరాచకం కావాలో, సంక్షేమం కావాలా.. సంక్షోభం కావాలో, సమర్థవంతమైన పరిపాలన కావాలా.. రాక్షసపాలన కావాలో!.. స్వర్ణయుగం కావాలో-రాతియుగం కావాలో ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు ఘనవిజయం చేకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, నెల్లూరు ఎంపీగా పోటీచేస్తున్న మంచివ్యక్తి, సౌమ్యుడైన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ప్రజలందరు ఆశీర్వదించాలని ఆయన కోరారు.

# శ్మశానాలనూ వదలని కాకాణి బ్యాచ్

## - సోమిరెడ్డి ధ్వజం



మంత్రి కాకాణి బ్యాచ్ అక్రమాలకు హద్దుల్లేవని, చివరికి శ్మశానాలను కూడా వదలడం లేదని మాజీమంత్రి, సర్వేపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పొదలకూరు మండలం నావూరు, నావూరుపల్లి, భోగసముద్రం, నూరాయుపాళెంలలో ఏప్రిల్ 30న ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ఇరిగేషన్ పనుల్లో కోట్లాదిరూపాయల అక్రమాలు జరిగాయని, రైతులు సోమశిల దక్షిణ కాలువ కింద మొదటి పంటను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమశిల జలాశయంలో 33 టీఎంసీల నీళ్లున్నా దక్షిణ కాలువ కింద నావూరు, నావూరుపల్లి, భోగసముద్రం రైతులకు మొదటి పంటకు నీళ్లు ఇవ్వలేదన్నారు. గత ఏడాది 30 టీఎంసీలు నీటిని వృథా చేసిన ఫలితంగా రైతులు మొదటి పంట వేసుకోలేని పరిస్థితి తెచ్చారని, ఇరిగేషన్ పనులు చేయకుండానే చేసినట్టు రికార్డుల్లో చూపి క్యాష్ చేసుకున్న కాకాణి అండ్ బ్యాచ్ ఆ నీళ్లన్నీ బురదపాల్జేసి రైతులకు కష్టాలు తెచ్చారని ఆయన ఆరోపించారు. మొదటి పంట వేసుకోలేకపోతే రైతులు ఎంత బాధపడతారో తనకు తెలుసన్నారు. ఐదేళ్లలో కాకాణి రైట్ అండ్ లెఫ్ట్ హ్యాండ్ల అవినీతి, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. సూరాయపాళెంలో 36 ఎకరాల మేత పోరంబోకు భూమిని కబ్జా చేసేశారని, గిరిజన కాలనీకి చెందిన 70 సెంట్లు శ్మశాన స్థలాన్ని ఆక్రమించేశారని, వైసీపీకి ఓట్లు వేసి గెలిపించినందుకు పేదల నుంచి పెద్దోళ్ల వరకు ఎవరినీ వదిలిపెట్టకుండా దోచుకుంటున్నారన్నారు. కొండలు, గనులు దోచుకున్నది చాలక, చివరకు శ్మశానాలను కూడా వదలడం లేదని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి సెంటు భూమిని ఆక్రమణల చెరనుంచి విడిపిస్తామన్నారు.




# నెల్లూరు కబుర్లు

## ఆదాలకు మద్దతుగా.. వైకాపాలోకి



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 20వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ నుంచి ఏప్రిల్ 28న వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలోకి భారీ చేరికలు జరిగాయి. దాదాపు 500 కుటుంబాల వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి-సంక్షేమపథకాలకు ఆకర్షితులై, నెల్లూరురూరల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు పలుకుతూ వైకాపాలో చేరిపోయారు. వారంతా ఆదాలకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆ డివిజన్‌లోని వైకాపా ముఖ్య నాయకులు ఆరుగుంట రాజారెడ్డి, వాకాటి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో, 20వ డివిజన్ ఇన్‌ఛార్జ్ రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్) సారథ్యంలో డివిజన్ నాయకుల సమన్వయంతో ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ ఆదాల వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారందరికీ భవిష్యత్తులో ఎటువంటి కష్టం వచ్చినా తాను అన్ని విధాల అండగా ఉండి సంపూర్ణ సహాయ సహకారాలందిస్తానని ఆదాల భరోసా ఇచ్చారు.

## చంద్రబాబును ప్రజలు నమ్మరు

### ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



అవకాశవాద రాజకీయాలు చేసే చంద్రబాబును ప్రజలు నమ్మరని నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరులోని 8వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ, రాష్ట్ర విభజనకు సహకరించిన చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. చంద్రబాబు ఇక శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పుకునేవిధంగా ప్రజలు ఈ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని, ప్రజల శ్రేయస్సుకోరే వైకాపాను మంచి మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## వేడుకగా..వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని రుక్మిణి-సత్యభామాదేవి సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఈనెల 28 ఆదివారంతో పూర్తయ్యాయి. చివరిరోజు స్వామివారికి ఉదయం చక్రస్నానం, సాయంత్రం ఏకాంతసేవ వేడుకగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఇఓ గిరికృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నెల్లూరులో టీడీపీ జెండా ఎగరాలి

### ప్రజలకు చంద్రబాబు పిలుపు



రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీని గెలిపించాలని, అందరూ కలిసికట్టుగా పనిచేసి నెల్లూరు నగరంలో టీడీపీ జెండా ఎగరేయాలని, నెల్లూరును ఎంతో అభివృద్ధి చేసిన నారాయణకు విజయం చేకూర్చాలని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఏప్రిల్ 28న నెల్లూరులోని కోటమిట్ట షాదీమంజిల్‌లో నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సులో, టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలిసి చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. ముస్లిం మైనార్టీలను వైకాపా ప్రభుత్వం కాలరాసిందని, ఈ ఎన్నికల్లో ప్రజలు వైకాపాకు గుణపాఠం చెప్పాలని అన్నారు. ఎన్డీఏతో పొత్తుపెట్టుకున్న తమను జగన్ విమర్శిస్తున్నారని, గడచిన అయిదేళ్లలో ఆయన ఏపార్టీకి మద్దతు తెలిపారో చెప్పాలని చంద్రబాబు ప్రశ్నించారు. ముస్లిమ్‌ల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. నెల్లూరులో రొట్టెల పండుగను రాష్ట్రస్థాయి పండుగ చేసిన ఘనత టీడీపీ దేనన్నారు. ఈ సమావేశానికి పెద్దసంఖ్యలో ముస్లిం మైనార్టీలు తరలి వచ్చారు. తొలుత నగరంలో టీడీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు.

## నారాయణా!.. విజయోస్తు!

### • అర్చకుల ఆశీర్వచనం



రానున్న ఎన్నికల్లో నారాయణ విజయాన్ని కాంక్షిస్తూ... 'విజయోస్తు' అంటూ అర్చకులు నెల్లూరు నగర నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నారాయణకు వేద ఆశీర్వచనం చేశారు. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఇటీవల అర్చక సమాఖ్య నాయకులు, అర్చకులు నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నెల్లూరు గోమతినగర్‌లోని నారాయణ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అర్చక సమాఖ్య నాయకులు ప్రసాదాచార్యులు, శేషాచార్యులు నాయకత్వంలో పెద్దఎత్తున అర్చకులు ఆయనకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చక సమాఖ్య నాయకులు, బ్రాహ్మణ సంఘం నాయకులు అమంచర్ల ప్రభాకర్, నవులూరు శ్రీకృష్ణ, పెనుబర్తి సాయిరాం, పూజిత్ తదితరులు పాల్గొన్నారు.

## బాలయ్యతో.. టీడీపీ నేతల భేటీ



'స్వర్ణాంధ్ర సాధికారయాత్ర' చేస్తూ, ఇటీవల జిల్లాలో ఎన్నికల ప్రచారం చేసేందుకు వచ్చిన ప్రముఖ సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ (బాలయ్య) ను నెల్లూరులోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నివాసంలో టీడీపీ నేత, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి డా. పొంగూరు నారాయణ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు కిలారి వెంకటస్వామినాయుడు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి, జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

## శబరి శ్రీరామక్షేత్రంలో.. వైభవంగా పుష్పయాగం



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శబరి శ్రీరామక్షేత్రంలో ఏప్రిల్ 27న సీతారాములకు అత్యంత వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి శోభాయమానంగా అలంకారాలు చేసి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు నరేష్‌స్వామి ఆధ్వర్యంలో 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షర విధానంలో 12 రకాల సుగంధభరిత పుష్పాలతో నిర్వహించిన ఈ పుష్పయాగం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ సీతారాములను, శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివార్లకు వేడుకగా పల్లకి సేవ జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా స్థానిక మీనాక్షి నృత్యాలయం విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ వారు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

## ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది

### • పరకాల ప్రభాకర్

దేశ ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, దానిని పరిరక్షించుకోవాలని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ అన్నారు. ఏప్రిల్ 28న నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవన్‌లో 'భారతదేశం- నేటి సవాళ్ళు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. పాలకులు దేశాభివృద్ధిని గాలికి వదిలేసి కులం-మతం పేరుతో పబ్బం గడుపుకుంటున్నారని, దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో పెరిగినా పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ప్రజల మధ్య విద్వేషాలను రగిలిస్తున్న వారికి, రాజ్యాంగ విలువలను ధ్వంసం చేస్తున్నవారికి ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సదస్సుకు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ రాజేశ్వరరావు అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ట్రస్ట్ ఛైర్మెన్ చంద్ర రాజగోపాల్, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అంకయ్య తదితరులు పాల్గొన్నారు.







## ఓటుతోనే యువతకు భవిత



ఓటు హక్కున్న యువత అంతా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటుతోనే యువతకు భవిత చేరువవుతుందని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి డా. ఎ.మహేంద్రరెడ్డి చెప్పారు. ఏప్రిల్ 29న నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్రంలో ఆయన ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. నెల్లూరుజిల్లా స్వచ్ఛంద సంస్థ ఎన్నికల నిఘా కన్వీనర్ కె.ఎస్ బాబా, బెస్ట్ సంస్థ కోఆర్డినేటర్ బి.త్రిభువనేశ్వర్, విశ్వాస్ సంస్థ నిర్వాహకుడు బి.శేషాద్రి, సయ్యద్ సాలార్, సయ్యద్ సర్తాజ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌లు రెడీ

ఓట్ల లెక్కింపుకు అవసరమైన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు అన్నిటినీ సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడులో ఉన్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో వాటిని ఆయన ఇటీవల సాధారణ ఎన్నికల పరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్‌సింగ్ బదూరియా తదితరులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రియదర్శిని కళాశాలలో ఉన్న నార్త్‌బ్లాక్‌లో నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటుచేశామని తెలిపారు.

## ➤ అభివృద్ధే అజెండా అంటున్న ఆదాల ...!



# మంచికి చోటివ్వండి... మేలు చేసేవారికి ఓటెయ్యండి

### ఆమంచర్ల రోడ్‌షోలో ఆదాల పిలుపు



చంద్రబాబునాయుడు పేరు చెబితే చాలు.. ప్రతిఒక్కరికీ గుర్తొచ్చేది కరువు కాటకాలేనని, టీడీపీ పాలనలో అంతా సంక్షోభాలే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా వారు అమలుచేయలేదని నెల్లూరు రూరల్ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి దుయ్యబట్టారు. పొరపాటున చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇప్పుడు వస్తున్న సంక్షేమ పథకాలు అన్నీ కూడా ఆగిపోవడం గ్యారంటీ అని, ప్రజలు బాగా ఆలోచించి ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలను అందించే వైకాపాకు విజయం చేకూర్చాలన్నారు. మంచికి చోటివ్వాలని, మేలు చేసేవారికి ఓటెయ్యాలని చెప్పారు. ఏప్రిల్ 29న ఆయన రూరల్ నియోజకవర్గంలోని ఆమంచర్లలో పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు, వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలసి భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన 25 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎక్కడా కూడా, ఎప్పుడూ కూడా చిన్న అవినీతి మచ్చ లేదని, ప్రజాసేవ కోసమే తాను రాజకీయాల్లోకి రావడం జరిగిందని చెప్పారు. తాను ఏ ఊరికి వెళ్ళినా ప్రజలు ఘనంగా స్వాగతిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు ఆదాలపై పూల వర్షం కురిపించారు. ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుండి తనను, నెల్లూరు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని ఇదే ఉత్సాహంతో మంచి మెజారిటీతో గెలిపించాలని ఆదాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన వినమ్రంగా చెప్పారు.

## 'జగన్ అంటే.. ఒక నమ్మకం' - కొనియాడిన ఆదాల



జగన్ అంటేనే ప్రజలకు ఒక నమ్మకమని, ప్రజాసంక్షేమ ముఖ్యమంత్రిగా ఆయన ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నారని నెల్లూరు రూరల్ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల ఆదాల జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి నెల్లూరు రూరల్‌లోని కొమ్మరపూడి, ములుముడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మేలు చేకూర్చే జగనన్న మేనిఫెస్టో అద్భుతమన్నారు. జగన్ ఏదైనా చెప్పాడంటే చేస్తాడని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాడని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం కొనసాగిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగిస్తూ, రానున్న ఐదు సంవత్సరాలలో మరింత అదనపు ప్రయోజనం చేకూరేవిధంగా మేనిఫెస్టోను విడుదల చేయడం జరిగిందన్నారు. జగన్ మళ్ళీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, సంక్షేమ పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## సంక్షేమం కొనసాగాలంటే.. మళ్ళీ జగనన్నే రావాలి

**- ఆదాల హిమబిందు**



పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా మళ్ళీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కుమార్తె హిమబిందు చెప్పారు. ఏప్రిల్ 29న ఆమె 18వ డివిజన్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెంకటరెడ్డినగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, సర్వేపల్లి కాలువ ప్రాంతాలలో కార్పొరేటర్ టి.అశోక్‌కుమార్, వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి తమ తండ్రి.. రూరల్ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఇంటింటా వైకాపా కరపత్రాలు పంచుతూ, వైకాపా ప్రభుత్వం ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో రూరల్ అభివృద్ధి ప్రదాత..తమ నాన్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, వైకాపా సీనియర్ నాయకులైన నెల్లూరు పార్లమెంట్ వైకాపా అభ్యర్థి విజయసాయిరెడ్డిని గెలిపించాలని, ప్రజలు బాగా ఆలోచించి ప్రజల మేలు కోసం పనిచేసే వైకాపాకు విజయం చేకూర్చాలని కోరారు.

# శ్రీసిటీలో పురస్కారాల వేడుక



ఉగాదిని పురస్కరించుకుని ఏటా శ్రీసిటీలో నిర్వహించే ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని ఇటీవల వేడుకగా నిర్వహించారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులకు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతులమీదుగా ఉగాది పురస్కారాలను అందచేశారు. సంగీత పురస్కారాన్ని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ గాయకులు కె.సరస్వతీప్రసాద్, సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, ఆధ్యాత్మిక పురస్కారాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త మరియు అన్నమయ్య, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబల ఆధ్యాత్మిక రచనల పరిశోధకులు గంధం బసవ శంకరరావు, పాత్రికేయ పురస్కారాన్ని తిరుపతికి చెందిన హిందూ మాజీ విలేకరి ఎ.దేవరాజన్ అందుకున్నారు. పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపిన రవీంద్ర సన్నారెడ్డి, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా ఎదుగుతున్న శ్రీసిటీ, మంచి నివాసయోగ్య ప్రాంతంగా రూపుదిద్దుకునే క్రమంలో కళలను ప్రోత్సహిస్తూ శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదికను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల బృందంచే సాగిన సంగీత విభావరి సభికులను అలరించింది. సంగీత బృందంలో వదలి లక్ష్మి (ఫ్లూట్), సంకీర్తి కుమార్ (వయోలిన్), కృష్ణవంశీ (మృదంగం), దివిష్‌చంద్ (ఘటం) పాల్గొన్నారు. శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావ్, సీఐ భాస్కర్ తదితరులు పాల్గొనగా, శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ ప్రయోక్తగా వ్యవహరించారు.

## కమ్యూనిటీ గ్రంథాలయం, క్రికెట్ మైదానం ప్రారంభం



శ్రీసిటీలో సామాజిక వసతుల కల్పనలో భాగంగా కొత్తగా ఇటీవల కమ్యూనిటీ గ్రంథాలయం, క్రికెట్ మైదానంలను ప్రారంభించారు. స్థానిక క్రీక్ సైడ్ నివాస సముదాయం సమీపంలోని షాపింగ్ ఆర్కేడ్ రెండవ అంతస్తులో పూజలుచేసి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. చిన్మయా విద్యాలయ ట్రస్టీ ఓవి నంబియార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక జ్ఞాన్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన క్రికెట్ మైదానాన్ని శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ప్రారంభించారు. ఈ నూతన వసతుల కల్పనపై స్పందించిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ పరిధిలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు వీటిని వినియోగించుకోవడం ద్వారా నైపుణ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పొందాలని పిలుపునిచ్చారు.















# అంగరంగ వైభవంగా వెంకయ్యనాయుడి మనుమరాలి పెళ్లి




అకుంఠిత దీక్షతో, నిబద్ధత కలిగిన క్రమశిక్షణతో సామాన్య స్థాయి నుండి అసామాన్య స్థాయికి ఎదిగి భారతదేశ ఉపరాష్ట్రపతిగా సేవలందించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు - శ్రీమతి ఉషమ్మల మనుమరాలు ముప్పవరపు హర్షవర్ధన్ - రాధల కుమార్తె **వైష్ణవి - సాయి వెంకటేష్** (ముత్తవరపు మురళీకృష్ణ - సుష్మల కుమారుడు)ల పెళ్ళి ఏప్రిల్ 26వ తేదీ శుక్రవారం రాత్రి తెల్లవారితే శనివారం హైదరాబాదులో ఘనంగా జరిగింది. శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగిన వధూవరుల పరిచయ కార్యక్రమంలో పలువురు వెంకయ్య కుటుంబ అభిమానులు, ఆప్తులు ఇరు కుటుంబాల బంధుమిత్రులు పాల్గొని కాబోయే కొత్త జంటని దీవించారు. ఈ పరిచయ వేడుకలో భారత ప్రస్తుత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ దంపతులతో పాటు తెలంగాణ, కర్ణాటక, మిజోరాం గవర్నర్లు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్.వీ.రమణ దంపతులతో సహా అనేకమంది రాజకీయ, పారిశ్రామిక, మీడియా, సినీ రంగాల ప్రముఖులు పాల్గొని దంపతులు కాబోతున్న **వైష్ణవి - సాయి వెంకటేష్**లకి తమ ఆశీస్సులు అందించారు. నవ వధూవరులకి 'లాయర్' శుభ దీవెనలు.

---

➤ సుపరిపాలన అందిస్తానంటున్న సురేష్..!

# వైకాపా రాక్షసపాలనకు చరమగీతం పాడాలి

## - ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్




మద్యపాన నిషేధం చేస్తానని చీప్ లిక్కర్ అధిక ధరలకు విక్రయించి ప్రజల ప్రాణాలతో చలగాట మాడుతూ, అరాచకత్వంతో రాక్షస పాలన అందిస్తూ పేదలకు నరకం చూపుతున్న వైకాపాను గద్దెదించాలని, జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం మండలం చల్లగిరగల, గరిమినపెంట, కోయవారిపల్లి, చల్లవారిపల్లి, ఇసుకదామెర్ల, కె.వి.ఆర్ కాలనీ, పొట్టిపల్లి, టి.యర్రబల్లి, మన్నంవారిపల్లి, చింతలదేవి.. ఇలా అనేక గ్రామాల్లో ఆయన 'పల్లె పల్లెకు కాకర్ల' కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రచారజోరును పెంచారు. పల్లె జనం కాకర్ల కోసం ఎర్రటి ఎండను సైతం లెక్కచేయక ప్రతి గ్రామంలో అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 40 సంవత్సరాలుగా మెట్ట ప్రాంతం మార్పు లేకుండా అలాగే ఉందని, ఉదయగిరి నియోజకవర్గం దశ దిశ మార్చేందుకే తాను ఎన్నికల రంగంలో దిగానని, ఈ కరువు సీమను సిరుల సీమగా చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ప్రజల డబ్బును దోచుకుని దాచుకునేందుకు తాను రాలేదని, కష్టపడి తాను సంపాదించిన సొమ్మును పుణ్యభూమికి ఖర్చు పెట్టాలన్న ఉద్దేశంతోనే ఎన్నికల రంగంలో దిగానని, ప్రజలు గమనించి ఆశీర్వదించాలని వేడుకున్నారు. ఉదయగిరి ప్రజలు చివరికి తాగేందుకు మంచినీళ్ళు కూడా లేకుండా దయనీయ స్థితిలో జీవిస్తున్నారని, తాను ప్రజల సమస్యలు తీర్చడం కోసం కృషిచేస్తానని అన్నారు. రెండు సంవత్సరాల కాలంలో తాను చేసిన సేవలు ప్రజలందరికీ తెలుసునని అంటూ, ఈ ఎన్నికల్లో రాక్షసులకు దేవతలకు జరిగే యుద్ధంలో దేవతలకు మద్దతునిచ్చి నియోజకవర్గ అభివృద్ధిని కోరుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# దుత్తలూరులో.. కాకర్లకు భారీ మద్దతు



ఉదయగిరి నియోజకవర్గం దుత్తలూరు మండలంలో టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌కు ఇతర పార్టీలనుంచి భారీమద్దతు లభిస్తోంది. గత వారంలో దుత్తలూరు మండలం బండకిందపల్లి గ్రామస్తులు తెలుగుదేశం పార్టీలో చేరగా, తాజాగా దుత్తలూరు మండల కేంద్రంలోని వైకాపా నాయకుడు బొందల రఘురామిరెడ్డి వర్గం మూకుమ్మడిగా ఆ పార్టీని వదిలిపెట్టి తెలుగుదేశం పార్టీలో చేరడం సంచలనం కలిగించింది. రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి సారథ్యంలో

## వైకాపా నుంచి రఘురామిరెడ్డి వర్గమంతా టీడీపీలోకి

కాకర్ల సురేష్ సమక్షంలో సుమారు 50 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. వారందరికీ కాకర్ల సురేష్ తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘు రామిరెడ్డి మాట్లాడుతూ, గత 40 సంవత్సరాలుగా మేకపాటి కుటుంబం వారు మెట్ట ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు.

### వరికుంటపాడులో ...

వరికుంటపాడు మండలంలో వైసీపీకి మరో షాక్ తగిలింది. కడియంపాడు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్ సారథ్యంలో టీడీపీలో చేరిపోయారు.



# టీడీపీ గెలిస్తే.. ఉచితంగా ఇసుక!



వైకాపా పాలనలో ఇసుక మాఫియా అక్రమాలు ఎక్కువైపోయాయని, ఎవరి చిత్తానుసారం వారు ప్రకృతి వనరులను దోచుకుంటూ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని, తెలుగుదేశం పార్టీ గెలిస్తే ఉచితంగానే ఇసుక ప్రజలకు అందుబాటులోకి తెస్తారని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల ఆమె కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు, పంచేడు గ్రామాల్లో పెద్దఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయాగ్రామాల్లోని మహిళలు తమ సమస్యలను విన్నవించుకోగా, సాగునీటి కాలువలలో పూడికతీయించడం, రోడ్లు వేయించడం, మంచినీటి సమస్యలు నివారించడంపై తాము దృష్టిపెడతామని ఆమె హామీ ఇచ్చారు.

> ప్రగతికే ప్రాధాన్యత అంటున్న ప్రశాంతిరెడ్డి

# గ్రావెల్ మాఫియా నుంచి కోవూరును కాపాడుకోవాలి

## లేగుంటపాడులో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపు

గ్రావెల్ మాఫియా నుంచి నుంచి కోవూరును కాపాడుకోవాలని కోవూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయమంటే దోచుకోవడం దాచుకోవడం కాదు. ప్రజా సమస్యలు తీర్చడం మాత్రమేనన్నారు. ఇటీవల ఆమె కోవూరు నియోజకవర్గంలోని లేగుంటపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ ప్రజలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. భారీఎత్తున మహిళలు ఆమెకు నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్ ద్వారా యువకులకు ఉపాధి కల్పిస్తామన్నారు. కోవూరు నియోజకవర్గ ప్రజల కోసం మా ఇంటి తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని చెప్పారు. వైకాపా ప్రభుత్వం ప్రజలను మాయ మాటలతో మోసపుచ్చుతోందని, సంక్షేమమంటూ ఈ చేత్తో పది రూపాయలు ఇచ్చి ఆ చేత్తో వందరూపాయలు లాక్కునే దుర్మార్గపు వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ఆమె ప్రజలను కోరారు. అక్రమ గ్రావెల్ వ్యాపారం ద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనం దోచుకున్న ప్రసన్నకుమార్‌రెడ్డిని సాగనంపాలని పిలుపునిచ్చారు.

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం :**

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఉంటుందని ప్రశాంతిరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే సమర్థత చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక వృద్ధులకు, వితంతువులకు రూ. 4వేల పెన్షన్ అందిస్తారని, వలంటీర్ల వ్యవస్థ ద్వారానే ఇంటింటికి పెన్షన్లు అందిస్తారని చెప్పారు. విద్యుత్ చార్జీలు పెరగవని, ఇసుక ఉచితంగానే లభిస్తుందని, సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రత్యేకించి మహిళలకు ఎంతో మేలు జరగనుందని చెప్పారు. ప్రజలు బాగా ఆలోచించి ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## మత్స్యకారులను ఆదుకుంటా



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక జీఓ నెంబర్ 270ని రద్దు చేసి మత్స్యకారులకు చెరువులపై హక్కును కల్పిస్తామని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల ఆమె కోవూరు నియోజకవర్గంలోని విడవలూరు మండలం పెద్దపాళెం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మత్స్యకారుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. టీడీపీ గెలిస్తే, మత్స్యకారుల సౌకర్యార్థం పెద్దపాళెం వద్ద నుంచి సముద్రం వరకు సీసీ రోడ్డు వేయిస్తానని, పెద్దపాలెం సముద్ర తీరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. టిడిపి అధికారంలోకొచ్చాక అమలు చేయనున్న 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా అమలుచేయబోయే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా, గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తొలిప్రాధాన్యత ఇస్తామన్నారు. కోవూరు ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.








# 6వ వర్థంతి

# శ్రీ గణపం ఓబులరెడ్డి గారు

జననం: 16.12.1939 నిర్యాణం: 05.05.2018

అమృతమూర్తి దివ్యస్మృతికి మా నివాళి.

- కుటుంబసభ్యులు

# సేవాభిలాషి.. మీ శ్రేయోభిలాషి.. రామ్‌కుమార్‌రెడ్డి

## ○ భారీ మెజార్టీతో గెలిపించాలన్న సీఎం జగన్





వెంకటగిరి అసెంబ్లీకి వైకాపా అభ్యర్థిగా పోటీచేస్తున్న నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తనకు మంచిమిత్రుడని, ఆయనెంతో సేవాభిలాషి, మీ శ్రేయోభిలాషి అని, రామ్‌కుమార్‌ను తప్పకుండా గెలిపించాలని వైకాపా అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 28న వెంకటగిరిలో పెద్దఎత్తున జరిగిన ఎన్నికల సభలో సీఎం మాట్లాడుతూ, వెంకటగిరిని రామ్‌కుమార్‌రెడ్డి అభివృద్ధి చేయగలడని, ఈసారి కూడా వెంకటగిరిలో వైకాపా జెండాను ఎగురవేయాలని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమపథకాలు అందాలంటే వైకాపా ప్రభుత్వమే మళ్ళీ రావాలన్నారు. వలంటీర్లు మళ్ళీ మీ ఇళ్ళవద్దకే రావాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, పేదల భవిష్యత్ మారాలన్నా, లంచాలు-వివక్ష లేని పాలన జరగాలన్నా, మన పిల్లల చదువులు బాగుపడాలన్నా, వ్యవసాయం మెరుగుపడాలన్నా వైకాపా గెలవాలన్నారు. 175కి 175 అసెంబ్లీస్థానాలు, 25 లోక్‌సభ స్థానాల్లో కూడా వైకాపాకు ఘన విజయం చేకూర్చాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ తగ్గడానికి లేదని అన్నారు.



## వైకాపా మేనిఫెస్టో.. అన్ని వర్గాల ప్రజలకు వరం - నేదురుమల్లి



వైకాపా మేనిఫెస్టో అన్నివర్గాల ప్రజలకు ఒక వరమని వెంకటగిరి ఎమ్మెల్యే వైకాపా అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి జగన్ మేనిఫెస్టోను ప్రకటించడం జరిగిందని ఆయన అన్నారు. ఏప్రిల్ 29న వెంకటగిరిలోని తన నివాసంలో ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి వైకాపా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అమ్మ ఒడి, వైయస్సార్ చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, వైయస్సార్ రైతు భరోసా, వైయస్సార్ పెన్షన్ వంటి పథకాల పెంపుతో పేదలకు మరింత ఆర్థిక భరోసా కలగబోతోందని ఆయన తెలిపారు. రూ.25వేల కన్నా తక్కువ వేతనం పొందే కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించడం జరుగుతుందని సీఎం జగన్ మేనిఫెస్టోలో పొందు పరచడం చారిత్రక అంశమన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలు 151 సీట్లు ఇచ్చి ఆదరించారని, గత అయిదేళ్ళుగా జనరంజకంగా పాలన సాగిస్తున్న వైకాపా ఈసారి 175 స్థానాల్లో ఘన విజయం సాధించడం తథ్యమని చెప్పారు. ఏప్రిల్ 28న వెంకటగిరిలో సీఎం జగన్ సభ పూర్తిస్థాయిలో విజయవంతమైందని ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, నిప్పులు చెరుగుతున్న ఎండను కూడా లెక్కచేయకుండా సభను విజయవంతం చేసిన అన్ని వర్గాల ప్రజలకు, వైకాపా శ్రేణులకు ధన్యవాదాలు చెప్తున్నానని ఆయన అన్నారు. అంతేకాకుండా, వెంకటగిరి చరిత్రలోనే కనీవినీ ఎరుగనివిధంగా నిర్వహించిన తన నామినేషన్ ర్యాలీని, సీఎం సభకు ఇసుకేస్తే రాలనంతగా తరలివచ్చిన జనం స్పందనను చూస్తే, ప్రజల మద్దతు ఎవరికి ఉందో తేటతెల్లమవుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు అభిమానులు అదే ఉత్సాహంతో పనిచేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గురుమూర్తిని గెలిపించాలని ఆయన కోరారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## మంచి జరిగి ఉంటే ఓటు వేయండనే నేత జగన్

### మేరిగ మురళీధర్



'మీ బిడ్డ మీకు మంచి చేసి ఉంటే ఓటు వేయండి' అని ధైర్యంగా అడగగలిగిన నేత ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని గూడూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. 14 ఏళ్ల తెలుగుదేశం పాలనలో మంచి జరగకపోయినా.. ఓటు కోసం వచ్చే నేత చంద్రబాబు అని చెప్పారు. ఇద్దరిలోనూ వ్యత్యాసాన్ని చూసుకొని ఓటు వేసి ఆదరించాలని, మెరుగైన పాలన ముందుందని ఆయన వివరించారు. తిరుపతి జిల్లా గూడూరు మండలంలోని పారిచర్ల, రాజుపాలెం, వెడిచర్ల, కొండగుంట, కుందకూరు, గొల్లపల్లి, కొమ్మ, కందలి, తుంగపాలెం, నాయుడుపాలెం గ్రామాల్లో వైకాపా అభ్యర్థి మేరిగ మురళీధర్ ఇటీవల ప్రచారం నిర్వహించారు. మండుటెండలోను ఆయన ప్రచారం కొనసాగింది. ప్రతి గ్రామంలోనూ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉన్న ఆలయాల్లో దర్శనం అనంతరం మేరిగ మురళీధర్ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. పార్టీ కరపత్రాలను పంచుతూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా గురుమూర్తిని ఆదరించాలని కోరారు. ఆయా గ్రామాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేత యద్దల నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి, జడ్పిటీసి సభ్యురాలు ఊటుకూరు యామిని, ఎంపీపీ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



## బాలయ్యకు అపూర్వ స్వాగతం

హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు గూడూరులో ఇటీవల మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం లభించింది. గూడూరులోని కోర్టు సెంటర్ నుంచి నరసింగరావుపేట, జీవన్ రాయల్ సెంటర్, అండర్‌బ్రిడ్జి, వివేకానందరోడ్డు, రైల్వేస్టేషన్, ముత్యాలపేట మీదుగా గడియారపు స్తంభం కూడలి వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు సెంటర్ వద్ద నిమ్మకాయలతో గజమాల వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం రోడ్‌షోలో వైకాపా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పాశం సునీల్‌కుమార్, వరప్రసాద్‌రావులను గెలిపించాలని కోరారు.

## ఎన్‌బికెఆర్‌లో సాంకేతిక సదస్సు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల ఐఇఇఇ విభాగం ఆధ్వర్యంలో 'నెక్సు స్పెర్స్-2కె24' జాతీయస్థాయి సాంకేతిక సదస్సు జరిగింది. పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు. 'కోడ్ డీ బగ్గింగ్', 'మినీ హ్యాకథాన్', 'టెక్ డిబేట్', 'స్పాట్ ఈవెంట్స్' వంటి అంశాల్లో విద్యార్థులకు పోటీలు జరిపి, విజేతలకు బహుమతులిచ్చారు. ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెరుగుతుందని, ప్రతి ఏటా ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి జరుగుతూనే ఉంటుందని చెప్పారు. ఐఇఇఇ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ సురేష్‌బాబు, సీఎస్ఇ విభాగాధిపతి రాజశేఖర్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి హరినాథ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల గెలుపుకు బిజెపి నాయకుల విస్తృత ప్రచారం

రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి, అవినీతి పాలన చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టి అభివృద్ధి పాలన అందించే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో బిజెపి నాయకులు ఓటర్లను కోరారు. గత నెల 29న గూడూరు ఒకటో పట్టణ ప్రాంతంలో టౌన్ అధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణనాయుడు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు గడపగడపకు వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ అమలుపరిచిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తూ ఇంటింటి ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టారు. ముఖ్యంగా తూర్పు వీధి, సంయుక్తనగర్, బాలాజీనగర్, బ్రాహ్మణవీధి, పూలతోట ప్రాంతాల్లో ప్రచారం చేపడుతూ స్థానిక నాయకులను, యువతతో కలిసి నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం చేస్తున్న అభివృద్ధి పనులు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు.



# వైకాపా పట్ల సర్వత్రా జనాదరణ

## - కిలివేటి సంజీవయ్య



తానెక్కడ ఎన్నికల ప్రచారం నిర్వహించినా ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారని, ముఖ్యమంత్రి జగనన్న పథకాల పట్ల జనాదరణ వెల్లువెత్తుతోందని సూళ్ళూరుపేట శాసనసభ వైకాపా అభ్యర్థి కిలివేటి సంజీవయ్య చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఇటీవల ఓజిలి మండలంలో రావిపాడు, ఆర్మేనిపాడు, గుర్రం కొండ, సగుటూరు, కర్రబల్లవోలు, పున్నేపల్లి, నెమళ్ళపూడి, గద్దగుంట గ్రామాల్లో నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలతో ఆత్మీయంగా కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇనుగుంట గ్రామంలో గ్రామస్తులు గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఎన్నికల కురుక్షేత్రానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఈ ఎన్నికల్లో వైకాపా విజయం తథ్యమని కిలివేటి అన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయంటూ జనం మెచ్చుకుంటున్నారని, దుష్ట చతుష్టయం ఎన్ని ఆరోపణలు చేసినా జగనన్నకు అండగా ఉంటామని ప్రజలు భరోసా ఇస్తున్నారని అన్నారు. తామంతా మీవెంటే ఉంటామని సూళ్లూరుపేట నియోజకవర్గం ప్రజలు చెప్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మండుటెండని సైతం లెక్క చేయకుండా కొండూరు, గ్రద్దగుంట, మాంబట్టు, వెండ్లూరుపాడు, కడలూరు గ్రామాల ప్రజలు ఆయన్ను పూలమాలలతో స్వాగతించారు.



# జగన్ పాలన దేశానికే ఆదర్శం

## మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. చంద్రబాబునాయుడు వంటి మోసగాడు దేశంలో ఎవరూ లేరని దుయ్యబట్టారు. ఇటీవల ఆయన వెంకటాచలం మండలంలోని అనికేపల్లి, గొలగమూడి, కంటేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేస్తామనే హామీతో 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఆ తర్వాత దాని విషయం పట్టించుకోలేదని విమర్శించారు. జన్మభూమి కమిటీల పెత్తనంతో చంద్రబాబు పాలన అంతా అస్తవ్యస్తంగా సాగిందని, ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. జగన్ సారధ్యంలో వైకాపా ప్రభుత్వం విప్లవాత్మక మార్పులతో పాలన సాగించిందని, పేదలకు దేశంలో కనీవినీ ఎరుగని విధంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఒక్క జగన్‌కే దక్కిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు టీడీపీని ఓడించి, ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే వైకాపాను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# మళ్ళీ జగనన్న వస్తే.. ప్రజలకు మరింత సంక్షేమం

## - మేకపాటి విక్రమ్‌రెడ్డి



మళ్ళీ ముఖ్యమంత్రిగా జగనన్న వస్తే రాష్ట్రంలో మరింత సంక్షేమం వచ్చినట్లే నని ఆత్మకూరు అసెంబ్లీ వైకాపా అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన ఆత్మకూరు నియోజకవర్గంలోని గోగులపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అయిదేళ్ల పాలనలో రెండేళ్లు కరోనాలో నష్టపోయినా, ప్రజలకు చెప్పిన ప్రతి సంక్షేమాన్ని అందించారని గుర్తు చేశారు. అదే విధంగా ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టోతో మరింత సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు సిఎం సిద్ధమవుతున్నారని, ఎన్నికల్లో వైకాపాను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# జానకిరామ.. రామాయణం 11

## - ఊటుకూరు జానకి రామారావు

శివ జటాజూటంలో బందీ అయిన గంగ కానరాక భగీరథుడు మళ్ళీ తీవ్రమైన తపస్సు చేశాడు.

మహాదేవుడు సంతసించి గంగను విడిచిపెట్టాడు.

జటాజూటం నుండి గంగ ఏడు పాయలుగా విడివడి ప్రవహించింది.

హ్లాదిని, పావని, నళిని ఈ మూడుపాయలు తూరుపుదిక్కుగా, సుచక్షువు, సీత, సింధువు ఈ మూడు పడమరదిక్కుగా ప్రవహించాయి.

భగీరథుడి వెంట ఏడవపాయ నడచింది. నడచిన ప్రాంతాలను ముంచెత్తుతూ మహావేగంగా కదలింది, సుళ్ళు తిరుగుతూ నడిచింది, హోరున శబ్దంచేస్తూ పరుగెత్తింది, ఉత్తుంగతరంగాలతో ఉవ్వెత్తున లేస్తూ కదిలింది! గంగా తరంగ ఘోష మృదంగ ధ్వనిలా ఒకచోట మేఘ గర్జనలా మరొకచోట వినిపించాయి! అంతకంటే వేగంగా ముందు పరుగెడుతున్నాడు భగీరథుడు.

గంగ తీవ్రమైన వేగంతో జహ్ను మహాముని ఆశ్రమాన్ని ముంచెత్తింది. గంగ చేసిన పనికి కోపంతో మహర్షి మొత్తం గంగానదిని ఒక్కగుక్కలో త్రాగి గంగను మాయం చేశాడు.

ఒక్కసారిగా నిశ్శబ్దం! ఏమై ఉంటుందా అని తిరిగి చూశాడు భగీరథుడు, గంగ కనపడలేదు.

అర్థమయ్యింది. మరల మహర్షిని సకలదేవ సంఘాలతో కూడి పరిపరివిధాలుగా ప్రార్థించాడు. మహర్షి కరుణించి తన చెవులనుండి గంగను విడిచిపెట్టాడు. అప్పటినుండి ఆవిడ "జాహ్నవి" అయ్యింది.

మరల భగీరథుడిని అనుసరించింది గంగ, సముద్రంలో ప్రవేశించి పాతాళానికి చేరి సగరపుత్రుల భస్మరాశిమీదుగా ప్రయాణించగా వారి పాపాలు నశించి స్వర్గం చేరుకున్నారు.

ఈ కథలో రెండు విషయాలు మనకు గోచరిస్తాయి.

ఒకటి భగీరథుడి అద్భుతమైన ప్రయత్నం! దానికి సరిసాటి ఇంకొకటిలేదు.

మనమొక లక్ష్యాన్ని నిర్ణయించుకొన్నప్పుడు అది పూర్తిచేయడం మన విధి. మడమ తిప్పరాదు. మధ్యలో కలిగే ఆటంకాలను ఓపికగా పరిష్కరించుకుంటూ పోవడమే!

ఇక గంగ అహంకారం! తాడిని తన్నేవాడుంటే వాడి తల దన్నేవాడుంటాడు అనటానికి ఉదాహరణ. అహంకారం పనికిరాదు.

విశ్వామిత్ర మహర్షి చెప్పే కథలతో రోజొక క్షణంలా గడచిపోతోంది రామలక్ష్మణులకు.

గంగావతరణం, క్షీరసాగరమథనం లాంటి కథలెన్నో చెప్పారు మహర్షి!

గంగను దాటి నడుచుకుంటూ మిథిలా నగర సమీపానికి వస్తూ ఉండగా వారి దృష్టిని ఒక ఆశ్రమం ఆకర్షించింది.

అది అత్యంత పురాతనమైంది, అయినా అందంగా ఉంది!

చిత్రంగా అక్కడ మనుష్య సంచారం లేదు! శూన్యమావరించి నట్లుగా ఉంది!

మహర్షీ ఈ ఆశ్రమం ఎవరిది? ఎప్పటిలానే రాముడు ప్రశ్నించాడు!

రాముడికి కథలు చెప్పటం అంటే విశేషమైన ఆసక్తి కనబరుస్తున్న మహర్షి, రాముడు అడిగిన వెంటనే చెప్పసాగాడు.

రామా! ఇది గౌతమ మహాముని ఆశ్రమం! ఆ ముని గొప్ప తపఃసంపన్నుడు! ఆయన భార్య అహల్య! అతిలోక సౌందర్యరాశి!

ఆమె మీద ఇంద్రుడి కన్నుపడింది! ఒకరోజు గౌతమ మహర్షి లేని సమయంలో గౌతముడి రూపం ధరించి అహల్య చెంతచేరాడు.

ఆవిడ పొందుగోరాడు! వచ్చినవాడు ఎవరో అహల్యకు తెలుసు! అయినా అతనితో సుఖించింది!

ఇంద్రుడు తిరిగి వెళుతుండగా గౌతముడి కంటపడ్డాడు. శాపానికి గురయ్యాడు.

భార్యను కూడా శపించాడు! వేల సంవత్సరాల పాటు నీవిక్కడే ఎవరికీ కనపడకుండా భస్మంలా పడిఉండి, కేవలం వాయు భక్షణం మాత్రమే చేస్తూ.. తపస్సు చేస్తూ ఇక్కడే పడివుండు, శ్రీరాముడు వచ్చినప్పుడు నీవు పరిశుద్ధురాలవై నన్ను చేరెదవు! అని శపించి తాను వెళ్ళిపోయాడు.

ఇదిగో! అదే ఆ ఆశ్రమం! అని చెపుతూ ఆ ఆశ్రమ ప్రాంగణంలో కాలు మోపుతుండగా! ఒక అద్భుతం జరిగింది!.

ఒక్కసారిగా ఆశ్రమ ప్రాంగణం ఏదో కొత్తదనం సంతరించుకుంది!

నిద్రాణమైన వస్తువులన్నీ మరల చేతనత్వం పొందాయి. తిరిగి నెమ్మదిగా జీవకళను సంతరించుకుంటున్నాయి!.

దూరంగా బూడిదకుప్పలో ఏదో కదలిక వచ్చినట్టుగా ఉంది.

*ప్రభుమేనిగాలి పైవచ్చినంతనంతనే పాషాణమొకటికి స్పర్శ వచ్చే!*
*ప్రభు కాలి సవ్వడి ప్రాంతమైనంతనే శిలకొక్క దానికి చెవులుకలిగే!*
*ప్రభుమేని నెత్తావి పరిమళించినతోనే*
*యశ్మమొకటి ఘ్రాణేంద్రియము చెందే!*
*ప్రభునీలరత్నతోరణ మంజులాంగంబు కనవచ్చి*
*రాతికి కనులు కలిగే.*

శ్రీ రామచంద్రుడి శరీరం మీది గాలి సోకగనే ఒక రాయికి స్పర్శ కలిగిందట, ఆయన కాలిసవ్వడి విని చెవులు పనిచేయటం మొదలు పెట్టాయట! ఆయన శరీర సుగంధం వ్యాపించినంతనే ఒక రాయికి వాసనలు తెలుస్తున్నాయట! నీలమేఘశ్యాముని రూపం కనవచ్చి రాతికి కన్నులు పనిచేయటం మొదలుపెట్టాయట.



- పైపద్యం విశ్వనాథవారి కల్పవృక్షం లోనిది!

చివరిగా ఆ శిల అహల్య ఆకారాన్ని సంతరించుకొంది!.

ఇంతలో గౌతమ మహర్షి కూడా వచ్చి చేరాడు వారిని.

అహల్య పట్టరాని ఆనందంతో ప్రభువు రూపాన్ని చూస్తూ అలాగే శిలలాగ నిలుచుండి ఆనందపారవశ్యంలో మునిగిపోయింది.

మునిదంపతుల ఆతిథ్యం స్వీకరించి మిథిలలో కాలుమోపాడు కోదండపాణి.

ఈ వృత్తాంతం సహజమైన మానవ బలహీనతలు మనల్ని తప్పు చేయించినప్పటికీ! ప్రాయశ్చిత్తం చేసుకొని, ఆ తప్పు చేయటం వలన కలిగిన అపరాధభావనలు ధ్యానం, తపస్సు ద్వారా తుడిచివేసుకొని మరల అంతరంగం పరిశుద్ధమైనదయితే చాలు అని చెప్తుంది.

ఒక తప్పు జరిగిన వెంటనే మనిషి జీవితం నాశనం కారాదు! ప్రాయశ్చిత్తం చేసుకున్న భార్యను స్వీకరించటంలోనే గౌతమమహర్షి యొక్క విశాల హృదయం మనకు తెలుస్తుంది.

.. (సశేషం)

# కళ్యాణ వైభవం...!




నెల్లూరు వాస్తవ్యులు గండవరపు వెంకట రమణారెడ్డి - హారితల కుమార్తె
**శ్రీ సాయి యశస్విని - చాణుక్యరెడ్డి**
(నెల్లూరు వాస్తవ్యులు కోలగట్ల యుగంధర్‌రెడ్డి - మనోరమల కుమారుడు)ల కళ్యాణం ఏప్రిల్ 28వ తేదీ నెల్లూరులో జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.

# స్వేచ్ఛ-సమానత్వం.. కాంగ్రెస్‌తోనే సాధ్యం

## నెల్లూరు పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.రాజు



దేశప్రజలకు మన రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ-సమానత్వం కలిగించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని, ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి విజయం చేకూర్చాలని నెల్లూరు పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి కె.రాజు చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 1న ఆయన బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్‌పార్టీ విధానాలను, కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ర్యాలీగా బిట్రగుంటలోని డా.అంబేద్కర్ సెంటర్ వద్దకు చేరుకుని సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా తాను పనిచేసి ఉండడంతో జిల్లా ప్రజల సమస్యల గురించి తనకు బాగా అవగాహన ఉందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు, కష్టజీవుల అభ్యున్నతికి అనేక పథకాలు అమలులోకి వస్తాయన్నారు. ఈ ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా తనను, కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొదలకూరు కళ్యాణ్‌ను గెలిపించి జిల్లా ప్రజలకు సేవచేసే భాగ్యం కల్పించాలన్నారు. తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే, నెల్లూరుజిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# 'జయభారత్' ఆసుపత్రిలో..మజ్జిగ చలివేంద్రం



నెల్లూరులోని సింహపురి వైద్య సేవాసమితి ట్రస్ట్ నిర్వహణలో ఉన్న జయభారత్ ఆసుపత్రి ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ ప్రాంత సంఘ్‌చాలక్..ఆ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి హరికుమార్ రెడ్డి మే1న మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరవింద, కిసాన్ సంఘ్ జాతీయ నాయకులు కుమారస్వామి, విజ్ఞానభారతి జిల్లా అధ్యక్షులు ఆర్ఆర్ఎస్ ప్రసాద్, డెప్యూటీ మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడుతూ, ఈ ఎండాకాలంలో ప్రతిరోజు సుమారు 400 మందికి పైగానే ప్రజలకు ఇక్కడ మజ్జిగ వితరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించాలనుకునే దాతలు 90003 38882, లేదా 89770 44789, 73370 00588 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఏదేమైనా, ఇప్పుడే కాదు, గత అయిదేళ్ళుగా మండువేసవి రోజుల్లో రోగుల కోసం ఆసుపత్రికి వచ్చే వారికి, స్థానిక ప్రజలకు చల్లని మజ్జిగ ఇచ్చి దాహార్తి తీరుస్తున్న హరికుమార్‌రెడ్డి సేవలు అభినందనీయం!..

# విద్వేషాలతో విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

## పరస్పర నిందలే ప్రధానం

వాళ్ళు అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చేస్తారు... వీళ్ళు అధికారంలోకి వస్తే ఫలానా మతానికి పథకాలు రావు.... ఇంకొకళ్ళు అధికారంలోకి వస్తే ఫలానా కులానికే ప్రయోజనం... వేరొకళ్ళు అధికారంలోకి రావటానికి ఫలానా కులం ఓట్లు కీలకం.... ఎలక్షన్ల సమయంలో ఎక్కడ చూసినా వినిపిస్తున్న మాటలివే. పెద్ద పెద్ద నాయకులు కూడా వీటి గురించి ప్రస్తావించటం, మీడియాలో సైతం ఇదే విషయం గురించి కథనాలు రావటం చూస్తుంటే ఈ కుసంప్రదాయం ఎక్కడికి దారితీస్తుందోనన్న ఆందోళన కలుగుతోంది. పరస్పర అభిమానాలు , ఆప్యాయతలు అన్నవి ఎండమావులుగా మారిపోతున్నాయి. కులాలు మతాలే రాజకీయాల్లో రాజ్యమేలుతున్నాయి. అందరూ కలిసి ముందుకు సాగాల్సిన ప్రజాస్వామ్యంలో ప్రజల మనసుల్లో నాటుతున్న విద్వేషపు బీజాలు ఇప్పటివి కావు. భారతదేశం స్వరాజ్యం సముపార్జించుకోక ముందు నుంచీ ఐక్యత లేని తనం మనకు సమస్యగా పరిణమిస్తూనే ఉంది.

## కులాలు, మతాలు ప్రామాణికంగా

బ్రిటీష్‌వారు వచ్చే నాటికి భారతదేశంలో వృత్తులు తప్ప కులాలు కనిపించేవి కాదన్నది మన పెద్దలు చెబుతున్న మాట. దేశంలో ఎప్పటి నుంచో కుల వ్యవస్థ ఉందన్నది మరికొందరు మేధావులు చెప్పే మాట. ఎవరి మాట నిజమనే విషయాన్ని పక్కన పెడితే... భారత దేశ గ్రామాలు ఐక్యతకు పట్టుకొమ్మలుగా ఉండేవి. కులమతాలతో సంబంధం లేకుండా వరుసలు పెట్టి పిలుచుకునే సంస్కృతి ఉండేది. స్వరాజ్య ఉద్యమంలో ప్రజలంతా సంఘటితమై ఉద్యమంలో పాల్గొనటం వెనుక ఇదే సంస్కృతి దాగి ఉంది. అయితే కడుపు నిండాక మన వాళ్ళకు కులమతాలు గుర్తుకు వస్తున్నాయి. స్వరాజ్యం సముపార్జించుకుని 75 ఏళ్ళ అమృతోత్సవాల తర్వాత ఇవి జ్ఞాపకానికి వస్తున్నాయి. ఎవరి నోట విన్నా ఇదే మాట. ఒక్కో పార్టీ ఒక్కో కులానికి కొమ్ము కాస్తోంది. కులం, మతం, భాష ప్రాతిపదికన ఓట్లు అడగరాదన్నది ఎన్నికల కమిషన్ నియమం. అయితే రాజకీయ పార్టీలు మాత్రం ఇదేదీ తమకు కాదు అన్నట్లు వ్యవహరిస్తున్నాయి.

## నిజంగానే రాజ్యాంగం మారుతుందా!

రాజ్యాంగం మారిపోతుందేమో అంటూ గుండెలు బాదుకునే వాళ్ళ కన్నీళ్ల వెనుక రాజ్యాంగం పట్ల గౌరవం ఎంతన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నే. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించే సమయంలో మార్పుల గురించి స్పష్టంగా చెప్పారు కూడా. మారుతున్న పరిస్థితులను బట్టి నియమాలు మారాలి. అలాంటి పరిస్థితుల్లో అనేక పర్యాయాలు రాజ్యాంగ సవరణలు జరిగిన విషయాన్ని వీరంతా మర్చిపోతున్నారేమో. ఇప్పటికి దాదాపు 100 సార్లకి పైగా రాజ్యాంగంలో మార్పు చేసుకున్నాం. అందులో తప్పేం లేదు. కానీ ఒక కులానికో, మతానికో అనుగుణంగా రాజ్యాంగాన్ని మారుస్తున్నారన్న మాటలు అసలు నమ్మే విధంగా ఉన్నాయా...? ఎమర్జెన్సీ లాంటి పరిస్థితులు తీసుకు వచ్చిన ప్రభుత్వాలకు ప్రజలు ఎలా బుద్ధి చెప్పారన్నది మనం చూశాం. ప్రజాస్వామ్యాన్ని చీకటిలోకి నెట్టాలనుకున్న ప్రతి సందర్భాన్ని ప్రజలు బలంగా తిప్పికొట్టారు. అలాంటి దేశంలో ప్రజల్లో ఇలాంటి ఆత్మన్యూనతా భావాన్ని నాటటం వెనుక రాజకీయ ప్రయోజనాలు తప్ప మరొకటి కనిపించటం లేదు. రాజ్యాంగం మార్చటం మాట అటుంచితే ఈ విషయాన్ని ఇంతలా ప్రచారం చేయటం వల్ల వచ్చే ప్రయోజనం ఏముంటుందో సామాన్య ప్రజలకు మాత్రం అర్థం కాదు. వారికి కావలసింది కూడు, గూడు, గుడ్డతో పాటు స్వేచ్ఛ. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ, హక్కులతో మన ప్రజాస్వామ్యం పచ్చగా ఉంది. మధ్యలో ఈ రాజకీయాలు మాత్రం కొత్త అడ్డుగోడల అపోహలను సృష్టించి తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయి.

## కులమతాలాపన ఆపాలి!

ప్రజాస్వామ్యంలో అందరూ ఓటు వేస్తేనే ఎవరైనా గెలుస్తారు అన్న విషయాన్ని మాత్రం రాజకీయ పార్టీలు మరచిపోతున్నాయి. తాము ఒక కులానికో, మతానికో సంబంధించినట్లుగా మాట్లాడ్డం కాస్తంత ఇబ్బంది కలిగించే విషయమే. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కావాలని కొందరు అంటుంటే, లేదు లేదు పాత విధానాలు అలానే కొనసాగాలని మరికొందరు అంటున్నారు. ఈ గొడవంతా ప్రజల బాగు కోసం మాత్రం కాదనే విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిన రహస్యం. ప్రతి పార్టీ తాము ఎక్కడ పోటీచేస్తుంటే అక్కడ ఓటింగ్ శాతం ఎక్కువ ఉన్న కులానికి తామే ప్రతినిధులం అన్నట్లు మాట్లాడుతూ ఉంటారు. కొన్ని పార్టీలు మాత్రం కొన్ని మతాలను దూషిస్తూ మాట్లాడ్డం కూడా ఈమధ్య మనం వింటున్నాం. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం ఎంత భద్రంగా ఉందనే విషయంలో సందేహాలు ముసురుతున్నాయి. ప్రజాస్వామ్యం అంటే ప్రజలు అనే పదం మరిచిపోతున్న నేటి రాజకీయాలు ఏ దిశగా నడుస్తున్నాయో తెలియటం లేదు. కులాల గురించి, మతాల గురించి, ఏ రాష్ట్రంలో ఎవరి ఓటు బ్యాంకు ఉందనే లెక్కల గురించి ఆలోచిస్తూ ప్రజల గురించి ఆలోచించటం మరచిపోతున్నాయి. పోనీ ఆ కులానికో, మతానికో ఏమన్నా మేలు చేస్తున్నాయా అంటే అదీలేదు. అధికారపక్షం, ప్రతిపక్షం చెరోవైపు నిలబడి ఏమీ చేయలేదని తిట్టుకోవటం, చేసే వాటిలో తప్పులను పట్టుకోవటం, చట్ట సభల్లో కొట్టుకోవటం చిన్న సమస్యని పెద్దదిగా చేసి భూతద్దంలో చూపించి కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకురావటం, ఇంతకు మించి ప్రజాస్వామ్యంలో సాధిస్తున్నదేమీ లేదు. గాలి కోసం కిటికీలు తీస్తే దుమ్ము కూడా వచ్చినట్లు, ప్రజలకు న్యాయం జరగాలని చట్టాలు చేస్తే, కొంతమంది వారి స్వార్థం కోసం వాడుకుంటున్నారు. ఫలితంగా ప్రజలకు మేలు చేయాల్సిన ఎన్నో పథకాలు, చట్టాలు అభివృద్ధికి అడ్డంకులుగా గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నాయి.

## పార్టీల తీరు మారాలి!

అన్ని పార్టీలు ఓ వైపు సమైక్యతా రాగాన్ని పాడుతూనే మరోవైపు కులమతాల రొచ్చులో కూరుకుపోతున్నాయి. ఇది ఎలాంటి సమైక్యత అన్న విషయాన్ని మాత్రం ఎవ్వరూ చెప్పలేకపోతున్నారు. తాజాగా రిజర్వేషన్ల పేరిట ఒక వైపు, మైనారిటీలు అంటూ ఇంకో వైపు రాజకీయ పార్టీలు కులమతాల రొచ్చును రేపి ప్రజల మధ్య చిచ్చు పెట్టి రెచ్చగొడుతున్నాయి.

అన్ని కులాల వారు తమకు రిజర్వేషన్ కావాలన్న డిమాండుని తెరపైకి తెస్తుంటే, ఇలాంటి తరుణంలో కులానికో కమిటీని, కులానికో భవనాన్ని ఏర్పాటు చేయటం ఎలాంటి అభివృద్ధికి సూచికో అర్థం కావడం లేదు. ఇది రెచ్చగొట్టడమా, లేకుంటే అందరి అభివృద్ధిని కాంక్షించటమా అన్న విషయాన్ని ఎటూ చెప్పలేని సందిగ్ధ పరిస్థితి. సాధారణంగా గతంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీల కింద పలు పథకాలను ప్రభుత్వాలు అమలుచేశాయి. బాగా ఒత్తిడిలో ఉండే వర్గాలకు పరిస్థితిని బట్టి అదనపు సౌకర్యాలు ఇవ్వటంలో తప్పు లేదు. కులవృత్తుల్లో ఉండేవారు ఆటుపోట్లను తట్టుకునేందుకు వారికి ఆర్థిక సాయం అందించటం తప్పులేదు. సమాజంలో గౌరవం సాధించుకోవటానికి పోరాడుతున్న వారికి చేయూతనివ్వటంలో ఇబ్బంది లేదు. ఆర్థికంగా వెనుకబడిన వారికి సాయం చేయటం కనీస ధర్మం కూడా. అయితే కులాల ప్రాతి పదికన, మతాల ప్రాతిపదికన చేస్తున్న సాయం ఏ రకమైన సహకారమో తెలియదు. ఇది అభివృద్ధి దిశగా పడుతున్న అడుగా కాదా అనే విషయం భవిష్యత్‌లో తేటతెల్లమవుతుంది.

***"అయం నిజ: పరో వేతి గణనా లఘుచేతసాం ఉదార చరితానాం తు వసుధైవ కుటుంబకమ్."***

"వారు నా వారు, వీరు పరాయి వారు అనే భావన సంకుచిత భావం ఉన్న వారికి మాత్రమే ఉంటుంది. విశాల భావాలు కలవారు సమస్త ప్రపంచాన్ని తమ కుటుంబంగానే భావిస్తారు." మహోపనిషత్తులోని ఈ వాక్యాన్ని ఈ తరం రాజకీయ నాయకులతో సహా ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. మన తోడబుట్టిన ప్రతిమనిషిని మన అన్నదమ్ములుగా చూడని రోజు, మన స్వేచ్ఛకు, నాగరికతకు అర్థంలేదు. రాజకీయ నాయకుల మాటల వెనుక పడిపోకుండా, వాస్తవాన్ని గ్రహించి మనిషి మసలుకున్న నాడు నిజమైన అభివృద్ధి సాకారం అవుతుంది. అవన్నీ పక్కన పెట్టి కులాన్ని, మతాన్ని మాత్రమే నమ్మి ఓటేసినన్నినాళ్ళు పరిస్థితులలో ఎలాంటి మార్పు రాదు సరికదా, మరింత దిగజారే ప్రమాదం లేకపోలేదు. అందుకే ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించి, నవభారతాన్ని నిర్మించుకోవాలి. భారతదేశ భవిష్యత్తును నిర్ణయించేది కులాలు, మతాలూ అన్న అపోహ తొలగిపోయిన నాడు మాత్రమే అది సాధ్యం.

**"సర్వేజనా సుఖినోభవంతు"**. స్వస్తి..!



## కన్నులపండువగా..
# కోదండరామునికి పట్టాభిషేకం

నెల్లూరు బాలాజీనగర్‌లో కొలువైవున్న శ్రీ సీతారామస్వామి మందిరం వారి ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న శ్రీ అనంత కోదండ రామస్వామి మహాపట్టాభిషేక మహోత్సవం కన్నులపండువగా జరిగింది. ఏవీఎస్ కృష్ణమోహన్-బాలత్రిపురసుందరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సీతారామస్వామి మందిరం-వాకాటి నరసయ్య త్యాగరాజ కళ్యాణమండపం కమిటీ నిర్వాహకులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, తన్నీరు మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావు, ఏ.వి సత్యం తదితరులు పర్యవేక్షించారు.

# మండే ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో ఎండతీవ్రతలు అధికమవుతున్న నేటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సూచించారు. ఎండతీవ్రత వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, ప్రజలు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. వడదెబ్బ తగలకుండా పనివేళల్లో మార్పులు చేసుకోవాలన్నారు. ఎండకు తిరక్కుండా నీడపట్టున ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, వాటిని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

# మే 26న..బ్రాహ్మణ వివాహ పరిచయవేదిక

నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న డిఎస్ఆర్ కల్యాణ మండపంలో మే 26న రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను ఏర్పాటుచేస్తున్నారు. అఖిలభారత బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రాల సమాఖ్య, జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి సంయుక్తంగా ఈ పరిచయవేదికను నిర్వహిస్తున్నామని జిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమితి ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ తెలిపారు. ఈ వేదికకు వచ్చేవారు మే 5వ తేదీలోగా తమ పేర్లు నమోదుచేసుకోవాలని, వివరాలకు 98484 86599, లేదా 79013 54004 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# వాకర్స్‌కు 'స్మైల్' దంత పరీక్షలు



నెల్లూరులోని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్థానిక స్మైల్ డెంటల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో వాకర్స్‌కు దంతపరీక్షలు నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఏప్రిల్ 28న జరిగిన ఈ కార్యక్రమంలో దంతవైద్యులు భవాని, యజ్ఞప్రియ పాల్గొని వాకర్స్‌కు దంత పరిరక్షణ పట్ల అవగాహన కలిగించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డీవీ సుబ్బరాజు. ఎస్.రమేష్‌బాబు, వ్యవస్థాపకులు నరేంద్రరెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమని గార్డెన్స్‌లో చలివేంద్రం

నెల్లూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ ఇటీవల నగరంలోని ఆమని గార్డెన్స్‌లో తమ తల్లితండ్రుల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి, ఈ మండు వేసవిలో స్థానికులకు చల్లని మంచినీరందిస్తున్నారు.

# శ్రీసిటీ పర్యావరణ వ్యవస్థ ప్రశంసనీయం

## జపాన్‌లోని భారత రాయబారి సిబి జార్జ్ కితాబు




శ్రీసిటీలో పర్యావరణ వ్యవస్థ ప్రశంసనీయమని జపాన్‌లోని భారత రాయబారి సిబి జార్జ్ కితాబునిచ్చారు. ఏప్రిల్ 28న ఆయన శ్రీసిటీని సందర్శించి శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి అద్భుతమంటూ కొనియాడారు. శ్రీసిటీ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, సామాజిక వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, దేశంలో ఇదొక ప్రధాన వ్యాపార గమ్యస్థానమని అభివర్ణించారు. శ్రీసిటీ జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ అభివృద్ధి పట్ల సానుకూలంగా స్పందిస్తూ, ఇక్కడ నివసిస్తున్న జపనీస్ ప్రతినిధులకు ఇది ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న అనేక పరిశ్రమలు తమ ప్లాంట్ విస్తరణలకు వెళుతున్నాయని గుర్తించి, భారత్‌లో జపాన్ వ్యాపార బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి, జపాన్ పెట్టుబడులను ఎక్కువగా ఆకర్షించడానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం, శ్రీసిటీ పరిసరాలతో పాటు ప్రముఖ జపనీస్ పరిశ్రమలు పానాసోనిక్, డైకిన్‌లను సందర్శించారు. శ్రీసిటీలోని అన్ని జపనీస్ కంపెనీల సీఈఓలతో సమావేశమై చర్చలు జరిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి రాయబారికి కృతజ్ఞతలు తెలిపారు. వారి పరిశీలనలు, సూచనలు, సిఫార్సులు మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడంలో శ్రీసిటీకి సహాయపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత ఆయనకు శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. భారతదేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా శ్రీసిటీ మారిందని ఆయనకు తెలిపారు. 220 మంది జపాన్ ప్రతినిధులు ఇక్కడ నివసిస్తున్నారని, జపాన్ సంస్కృతీ సంప్రదాయాలకు ధీటుగా పలు సదుపాయాలను ఇక్కడ కల్పిస్తున్నామని కూడా వివరించారు.

# చెరువులు ఆక్రమించేస్తున్నారు

• పరిరక్షణ సమితి సభ్యుల ఆందోళన



కావలి సమీపంలోని మందాటి చెరువును, పాపిరెడ్డి చెరువును కొందరు దురాక్రమించేస్తున్నారని, అధికారులు వెంటనే పరిశీలించి చెరువులను దురాక్రమణల నుండి కాపాడాలని చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు వాపోతున్నారు. ఏప్రిల్ 27న వారు విశ్రాంత అధ్యాపకులు కనుమూరి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మందాటి చెరువు వద్ద ఆందోళన చేపట్టారు. చెరువులను కబ్జా కోరల నుంచి విముక్తిచేసి భావితరాలవారికి అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ ఆందోళనలో చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు మందా కిరణ్, కోటేశ్వరరావు, ఇంటూరి రమణయ్య, జార్జి, రాకేశ్, వెంకయ్య, శ్రీనివాసులు, మధు పాల్గొన్నారు.

# పెళ్ళికి వెళ్ళొచ్చేసరికి.. ఇల్లు గుల్ల!

• పొదలకూరులో దొంగల బీభత్సం

పొదలకూరు పట్టణంలో ఇటీవల దొంగలు విజృంభించారు. మారుతీనగర్‌లో కాపురం ఉంటున్న సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల పెళ్ళికని వేరే ఊరికి వెళ్ళి ఉండగా, వాళ్ళు తిరిగొచ్చేలోగా దొంగలు ఇంటితాళాలు, తలుపులు పగలగొట్టి బీరువా తెరచి ఉన్నదంతా ఊడ్చుకుపోయారు. రాత్రి వెళ్ళి, ఉదయం వచ్చేలోగా ఈ చోరీ జరిగిపోయింది. బీరువాలో ఉన్న లక్ష రూపాయలతో పాటు, 18 సవర్ల బంగారునగలను దోచుకుపోయారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో దొంగల ఆచూకీ కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు.

# కార్మికుల ఆరోగ్యం జాగ్రత్త!

జిల్లాలో ఎండవేడిమి పెరుగుతున్న నేపథ్యంలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండ వేడిమి నుంచి ఉపశమనంగా ఉండేందుకు కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీళ్ళ వసతి కల్పించాలని జిల్లా కార్మికశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల తర్వాత పనులు చేయించుకోవాలని యాజమాన్యాలకు ఆయన సూచించారు.

## టూకీగా...



### తోపుగుంటలో సత్యమ్మతల్లికి కొత్త ఆలయం

కలువాయి మండలంలోని తోపుగుంట గ్రామదేవత శ్రీ సత్యమ్మతల్లికి కొత్తగా నిర్మించిన ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం ఈనెల 28న వైభవంగా జరిగింది. తోపుగుంట, తోపుగుంట అగ్రహారం గ్రామస్తులు ఇంతవరకు ఉన్న అమ్మవారి మాను స్థానంలో కొత్తగా ఆలయం నిర్మించి, ధ్వజస్తంభాన్ని, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి పెద్దఎత్తున పూజలు చేశారు.

### వింజమూరు ఆరోగ్యకేంద్రం పరిశీలన

అర్ధరాత్రివేళ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి రోగులకు వైద్యసేవలందిస్తున్నారా లేదా, అందరూ విధులకు హాజరవుతున్నారా?.. పరిశీలించేందుకు డీసీహెచ్ఎస్ రమేష్ ఏప్రిల్ 28న వింజమూరులోని ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా రాత్రి ఒంటిగంట సమయంలో తనిఖీ చేశారు. వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

### మనుబోలు జాతీయ రహదారిపై తనిఖీలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మనుబోలు మండలంలోని జాతీయరహదారిపై అధికారులు వాహనతనిఖీలను ముమ్మరం చేశారు. రూ. 50వేలకు మించి డబ్బు ఉంటే, అందుకు సంబంధించిన బిల్లులు తప్పకుండా ఉండాలని, అధికసంఖ్యలో వస్తువులు వగైరాలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ప్రేమలత హెచ్చరించారు.

### ఇర్లపాడులో.. శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మర్రిపాడు మండలం ఇర్లపాడులో ఇటీవల 13 అడుగుల ఏకశిలా అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వేదపండితులు స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. భక్తులందరికీ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ గావించారు.

### కదిరినాయుడుపల్లి వద్ద అడవిలో మంటలు

గుర్తుతెలియని వ్యక్తులెవరో నిప్పు పెట్టడంతో అడవంతా మంటలు చెలరేగాయి. పచ్చని చెట్లన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వద్ద ఇటీవల అడవి అగ్నికి ఆహుతవడం చూసి స్థానికులు ఆవేదన చెందారు. ఎంతో విలువైన ప్రకృతి సంపద మంటల్లో మాడిపోతుండడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు.

### పొదలకూరు సెబ్ కార్యాలయం తనిఖీ

పొదలకూరులోని సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) కార్యాలయాన్ని జిల్లా సెబ్ ఆఫీసర్ పి.దయాసాగర్ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఆయన వెంట సెబ్ ఇన్స్‌పెక్టర్ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

### జంగాలకండ్రిగలో గడ్డివాములు దగ్ధం

ముత్తుకూరు మండలం జంగాలకండ్రిగలో ఇటీవల అగ్నిప్రమాదం జరిగి రెండు గడ్డివాములు కాలిపోయాయి. సమాచారం అందుకున్న నెల్లూరు అగ్నిమాపక దళాధికారులు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో సుమారు రెండు లక్షల రూపాయల దాకా నష్టం జరిగిందని బాధితులు కోట జయరామయ్య, శేషయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

### కొత్తూరులో 'ఆరోగ్య సురక్ష'

ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు గ్రామ సచివాలయం పరిధిలో ఇటీవల ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సాయిలహరి పర్యవేక్షణలో జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనంగా ఉండేందుకు రోగులకు ఓఆర్ఎస్, గ్లూకోజ్ ప్యాకెట్లు అందజేశారు.

### కోవూరులో ట్రాన్స్‌ఫారమ్‌ను ఢీకొట్టిన లారీ

కోవూరులోని కొత్తూరు రోడ్డు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌ను ఈనెల 27వ తేదీ రాత్రి ఓ లారీ ఢీకొట్టడంతో ధ్వంసమైంది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు వెంటనే వచ్చి కొత్త ట్రాన్స్‌ఫారమ్ ఏర్పాటుకు పనులు చేపట్టి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

# మాగుంట లే-అవుట్ సమస్యలన్నీ తీరుస్తా! - ఆదాల హామీ

నెల్లూరులోని మాగుంట లే-అవుట్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, ఆ లేఅవుట్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తామని నెల్లూరు రూరల్ అసెంబ్లీ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మే 1న ఆయన స్థానిక మాగుంట లే-అవుట్‌లోని హెచ్ఎస్ఆర్ కల్యాణమండపంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో నెల్లూరు ఎంపీ వైకాపా అభ్యర్థి విజయసాయిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన మాగుంట లేఅవుట్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, ఈ ప్రాంతం అభివృద్ధి చెందిన ప్రాంతం కాబట్టి ఇంకా ఇక్కడ ఏమైనా మౌలిక వసతులు అవసరమో గుర్తించి, వాటిని కూడా ఆలస్యం చేయకుండా పూర్తిచేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతవాసులు చాలా విద్యావంతులని అంటూ, మీరందరూ కచ్చితంగా ఓటింగ్‌కు వచ్చి, సరైన అభ్యర్థికి ఓటు వేసి ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యాధికులు, మంచి ఉన్నత స్థానంలో ఉన్న ఈ ప్రాంతవాసులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేద-మధ్యతరగతి ప్రజలకు చేస్తున్న మంచిని గురించి వివరించి, వారు కూడా ఉత్సాహంగా ఓటు వేసేందుకు ప్రోత్సహించాలని ఆయన కోరారు.





రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయి రెడ్డిని బలపరిచి అత్యధిక మెజార్టీతో తమను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా వైకాపా మహిళా అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, వైకాపా నాయకులు పేర్నేటి శ్యాంప్రసాద్ రెడ్డి, మాగుంట లేఅవుట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు రోజారెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, వైవి రామిరెడ్డి, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, నియోజక వర్గ పరిశీలకులు మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాల చెరువును పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతా!

నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువును ప్రత్యేక పర్యాటక హబ్‌గా గుర్తించి అభివృద్ధి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆదాల చెప్పారు. అంతేకాదు, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజల చిరకాల కోరిక అయిన రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని, మొగళ్లపాళెం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూడా ఎన్నికల అనంతరం ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సహకారంతో పూర్తి చేయించడం జరుగుతుందని తెలిపారు.

# లోకేష్ రాకతో.. టీడీపీలో జోష్

## జిల్లాలో 'దేశం' విజయఢంకా మోగిస్తుందన్న యువనేత



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ మే 1న నెల్లూరుకు రావడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. పెద్దసంఖ్యలో యువత, కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చి ఆయన్ను ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా నగరంలోని వి.ఆర్.సి మైదానంలో నిర్వహించిన 'యువగళం' సభలో లోకేష్ మాట్లాడుతూ, నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం ఖాయమని, రానున్న ఎన్నికల్లో విజయ ఢంకా మోగించేది టీడీపీయేనని అన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వంటి దాతలు, సౌమ్యులు తెలుగుదేశం పార్టీలోకి రావడం సంతోషకరమని, ప్రజాసేవ తప్ప మరో వ్యాపకం లేని వ్యక్తి వేమిరెడ్డి అని, అలాంటి వారిని ఎంపీగా చేసుకుంటే ఈ ప్రాంతం సస్య శ్యామలం అవుతుందని, ఇక నెల్లూరు అభివృద్ధికి ఢోకా ఉండదని అన్నారు. పొరపాటున విజయసాయిరెడ్డిని గెలిపిస్తే విశాఖను దోచుకున్నట్లే నెల్లూరును కూడా ఆయన దోచేసుకుంటాడని లోకేష్ హెచ్చరించారు. నెల్లూరుజిల్లాకు వేమిరెడ్డి ఎంత గొప్ప సేవలు చేశారో తాను పాదయాత్రలో తెలుసుకున్నానని, జిల్లాలో ఎక్కడ చూసినా వేమిరెడ్డి సేవలే కనిపిస్తున్నాయని లోకేష్ కొనియాడారు. సొంతనిధులు వెచ్చించి వేలాదిమంది గ్రామీణ ప్రజల దాహార్తి తీరుస్తున్న వేమిరెడ్డి ఈ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైకాపా విధానాలు నచ్చకే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆ పార్టీ నుండి బయటకు వచ్చారని అన్నారు. ఈ ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీచేస్తున్న వేమిరెడ్డిని, నెల్లూరు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న పొంగూరు నారాయణ, రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# 'నిడిగంటి'కి..'టాంటెక్స్' అవార్డు



తెలుగు భాషాభిమాని.. అమెరికాలో ఉంటున్న మన నెల్లూరీయుడు నిడిగంటి గోవర్ధన్‌రావుకు నార్త్ టెక్సాస్‌లోని తెలుగు అసోసియేషన్-టాంటెక్స్ వారు ప్రతిష్ఠాత్మకమైన అవార్డునిచ్చి గౌరవించారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా అమెరికాలోని డాల్లస్ నగరంలో జరిగే 'నెలనెలా తెలుగు వెన్నెల' కార్యక్రమానికి ఆయన అందిస్తున్న సహకారానికి గుర్తింపుగా వారు ఆ అవార్డును బహూకరించారు. ఏప్రిల్ 27న నార్త్ టెక్సాస్‌లో జరిగిన 'టాంటెక్స్ క్రోధి నామ ఉగాది ఉత్సవాల సందర్భంగా తెలుగుభాషకు వెలుగులు తెచ్చేవిధంగా విశేష సేవలందిస్తున్న విశిష్ట వ్యక్తులకు అందించే 'బెస్ట్ వలంటీర్' పురస్కారాన్ని ఈసారి గోవర్ధన్‌రావు అందుకోవడం విశేషం.

# గ్రంథాలయశాస్త్రంలో డాక్టరేట్



వింజమూరు నివాసి.. ఆత్మకూరులోని డా.సామల రామయ్య-జానకమ్మ డిగ్రీ కళాశాలలో లైబ్రరీసైన్స్ అధ్యాపకునిగా ఉన్న కళాశాల పూర్వవిద్యార్థి టి. శ్రీనివాసులురెడ్డికి గ్రంథాలయశాస్త్రంలో డాక్టరేట్ లభించింది. 'ఆంధ్రప్రదేశ్-శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో ప్రత్యేకించి ఆత్మకూరు మండల గ్రామీణ సమాచార అవసరాలు మరియు సమాచారం పొందే విధానాలు' అనే అంశంపై పరిశోధన సిద్ధాంతం సమర్పించినందుకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు ఆయనకు ఇటీవల పీహెచ్‌డీని ప్రదానం చేశారు. ఎస్వీయు విశ్రాంత ఆచార్యులు వి.పుల్లారెడ్డి ఆయన ప్రాజెక్టుకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. డాక్టరేట్ పొందినందుకు శ్రీనివాసులురెడ్డిని కళాశాల కరెస్పాండెంట్ ఎస్.రాధాకృష్ణయ్య, ప్రిన్సిపాల్ జి.వరకుమార్, అధ్యాపకులు సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు అభినందించారు.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com